J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 27 06.12.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# ఔను.. వాళ్ళిద్దరూ కష్టపడ్డారు!

*'ఔను వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు'.. అది వెండితెరపై నడిచిన సినిమా కథ. 'ఔను వాళ్ళిద్దరూ కష్టపడ్డారు'.. ఇది రాష్ట్రాల రాజకీయాలలో నడుస్తున్న రాజీ కథ. 'కలసివుంటే కలదు సుఖము, కలసివచ్చును అదృష్టము' అన్న ఫార్ములాని జాతీయ, ప్రాంతీయ పార్టీలు కలసి ఆచరిస్తున్నాయి. ఫలితంగా మంచి ఫలితాలనే సాధిస్తున్నాయి. అయితే కొన్ని సందర్భాలలో ఒకే జాతీయపార్టీకి చెందిన ఇద్దరు లేదా ముగ్గురు శక్తివంతమైన నాయకులు కూడా ఒక్కటవుతున్నారు. తమ సీనియారిటీని పక్కనపెట్టి కొత్తతరం నాయకుల సిన్సియారిటీ పై ఆధారపడుతున్నారు.*

## కలిసొస్తున్న పొత్తులు - ఫలిస్తున్న రాజకీయ ఎత్తులు

## ఓటమి రుచిచూపిస్తున్న.. ఒంటరి పోరాటం

పదవుల విషయంలో సైతం ఆ నేతలు రాజీపడి పాలన సాగించడంలో పావులు కదుపుతున్నారు. మనం లేదా మన పార్టీ అధికారంలో ఉంటే అంతే చాలన్న సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నారు. ప్రాంతీయ పార్టీలని అధికారంలోకి రానీయకూడదన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. తాజాగా జరిగిన మహారాష్ట్ర ఎన్నికలతో పాటు గతంలో జరిగిన అనేక ఎన్నికలలో ఏర్పడ్డ పొత్తులు మనకి ఈ విషయాలని రుజువు చేస్తున్నాయి. ప్రస్తుత రాజకీయాలలో ఒంటరి పోరాటంతో సత్ఫలితాలు రావన్న ఆలోచనతో అన్ని పార్టీలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి.

### ఎన్నో గతానుభవాలు!

కొన్ని గతానుభవాలని గమనిస్తే.. తెలుగుదేశం పార్టీ పెట్టడం ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సంచలనాత్మకంగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన నందమూరి తారక రామారావు తొలి ఎన్నికలలో పొత్తుపైనే మొగ్గు చూపించారు. ఇందిరాగాంధీపై వ్యతిరేకతతో తాను పార్టీ పెట్టానన్న సంకేతాలు రావడం కోసం ఇందిరమ్మని వ్యతిరేకిస్తున్న ఆమె చిన్న కోడలు మేనకా గాంధీకి చెందిన సంజయ్ విచార్ మంచ్ పార్టీకి అయిదు సీట్లు కేటాయించి 289 స్థానాలలో తెలుగుదేశాన్ని బరిలో దించారు. కేవలం నాలుగు సీట్లు గెలిచినా ఓడినా పెద్ద తేడా ఉండదు. కానీ తాను ఇందిరమ్మకి వ్యతిరేకం అన్న స్పష్టతని ఈ పొత్తు ద్వారా రామారావు కల్పించారు. అయితే, సంజయ్ విచార్ మంచ్ పోటీచేసిన అయిదు సీట్లకి గాను 4చోట్ల విజయం సాధించడం విశేషం! అదే క్రమంలో ఆయన జాతీయ రాజకీయాలలో సైతం చురుకైన పాత్ర పోషించి 'నేషనల్ ఫ్రంట్'కి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆ తరువాత రోజుల్లో ఆయన బీజేపీకి దగ్గరై 1994లో కమలదళంతో కలసి పోటీ చేశారు. ఆ దోస్తీని చంద్రబాబు కొనసాగించారు.

అత్యంత శక్తివంతమైన నాయకుడిగా ఎదిగిన దివంగత మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి కూడా 2004లో ఆనాటి ఎన్నికలని అంత సులభంగా భావించలేదు. అప్పటికే తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కుర్చీలో పాతుకుపోయి ఉండిన అప్పటి సీఎం చంద్రబాబుని ఆయన ఆషామాషీగా తీసుకోలేదు. బాబుని గొప్ప నాయకుడిగా ఆయన భావించారు. అప్పటి ఎన్నికలలో తన నాయకత్వంలోని కాంగ్రెస్‌పార్టీ ఖచ్చితంగా గెలవబోతోందని ఎన్ని సర్వేలు చెప్పినా ఆయన రిస్కు తీసుకోలేదు. ఒంటరి పోరాటానికి మొగ్గు చూపలేదు. చంద్రబాబు గెలవడానికి ఎవరితోనైనా కలవడానికి వెనుకాడరని వై.ఎస్‌కి తెలుసు, అందుకే ఆయన చంద్రబాబుకి ఆ అవకాశం ఇవ్వలేదు. కేసీఆర్‌తో సహా సీపీఎం, సీపీఐ పార్టీలని మొత్తాన్ని

10లో




## రామబాణంలా నింగిలోకి దూసుకుపోయిన విజయాశ్వం

## పిఎస్ఎల్వి-సి59 దిగ్విజయం

*శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన పీఎస్ఎల్వి-సీ59 రాకెట్ ప్రయోగం దిగ్విజయమైంది. గురువారం సాయంత్రం సరిగ్గా 4 గంటలా 4 నిమిషాలకు ఆ రాకెట్ రామబాణంలా నింగిలోకి దూసుకుపోయింది. ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలతోపాటు సర్వత్రా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయంతో భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలకు వీలవుతుందని ఆయన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు.*

10లో



## రైతుల విషయంలో రాజకీయాలు చేస్తే..

# దేవుడు కూడా క్షమించడు

### సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి



రైతుల విషయంలో రాజకీయాలు చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తే ఆ దేవుడు కూడా క్షమించడని, వైకాపా హయాంలో రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వ్యవసాయానికి సంబంధించిన పనులను ప్యాకేజీలుగా మార్చి అందినకాడకి దోచుకున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి అన్నారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద పూడిక తీసిన సాగునీటి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్పట్లో లస్కర్లకు జీతాలు ఇప్పించలేని వాళ్లు.. ఇప్పుడు రైతుల పర్యవేక్షణలో పారదర్శకంగా పనులు జరుగుతుంటే అడ్డగోలు మాటలతో అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. పంట కాలువలకు ఐదేళ్ల తర్వాత మళ్లీ పూర్వ వైభవం వచ్చిందని అన్నదాతలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సాగునీటి కాలువల్లో పూడికతీతకు సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులతో 86 పనులు మంజూరు చేయించామని, ప్రతి పనిని పెద్ద కాంట్రాక్టర్లు కాకుండా, ఏ ఊరికి ఆ ఊరి రైతులు సొంతంగా పర్యవేక్షించి కాలువలను బాగుచేసుకునే విధంగా ఏర్పాటుచేశామన్నారు. అయితే, సోషల్ మీడియాలో నిత్యం చిలకపలుకులు పలికే ఓ పెద్దమనిషి హయాంలో ఎన్నికలకు 4 నెలల ముందు రూ.30కోట్ల విలువైన పనులను ఆరు ప్యాకేజీలుగా చూపారని, ఆ ప్యాకేజీల్లోని పనులను కూడా చేయకుండానే బిల్లులు చేసేసుకున్నారని ఆయన విమర్శించారు. పూడిక తీయని కాలువలకు నీళ్లు వదిలి, గత ఏడాది రెండో పంట సమయంలో 30 టీఎంసీల నీటిని బురదలో కలిపేశారని, మొదటి పంటలో మూడు లక్షల ఎకరాల్లో పంట లేకుండా చేశారని దుయ్యబట్టారు. అడ్డగోలుగా మాట్లాడుతున్న వైసీపీ నాయకులు ఊళ్లలోకి రైతుల మధ్యలోకి వెళ్లండి.. ఎవరి హయాంలో కాలువలో బాగుపడ్డాయో తెలుసుకోండని ఆయన హితవు పలికారు.

### ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయిస్తాం

చెముడుగుంట పంచాయతీ పరిధిలోని నక్కలకాలనీ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, కమ్యూనిటీహాలుతో పాటు పేదలకు స్థలాలు కేటాయిస్తామని, అర్ధాంతరంగా ఆగిపోయిన ఇళ్లను పూర్తి చేయిస్తామని సోమిరెడ్డి చెప్పారు. ఐటీడీఏ సహకారంతో ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్ తయారీకి రుణాలు అందిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన ఇటీవల ఆ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో నక్కలకాలనీలో ఒక్కో కుటుంబానికి 33 అంకణాల స్థలం ఇచ్చారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇప్పుడు ఇళ్లు లేని వారికి స్థలాలు మంజూరు చేయడంతో పాటు పక్కా గృహాలు కట్టిస్తామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండేలా చూడటంతో పాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశామన్నారు. ప్రతి గ్రామ పర్యటనలో గిరిజన కాలనీలను అధికారులతో కలిసి సందర్శించి వారి సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యావంతులు కూడా గిరిజనుల అభివృద్ధిపై దృష్టిపెట్టి.. వారిలో చైతన్యం తెచ్చేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు.

## కార్యకర్తల సంక్షేమానికే తొలి ప్రాధాన్యత

### మంత్రి నారాయణ



తెలుగుదేశం పార్టీలో కార్యకర్తల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులో ఆయన ఇటీవల 1వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధిపనులను డివిజన్ అధ్యక్షులతో కలసి సమీక్షించారు. డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరును స్మార్ట్ సిటీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చెయ్యాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమంపై డివిజన్ల అధ్యక్షులతో చర్చించారు. ప్రజలే అడిగిమరీ సభ్యత్వాలు చేయించుకుంటున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సభ్యత్వాలు తీసుకోవడం ద్వారా కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తూ ఏమైనా ప్రమాదం జరిగితే.. పార్టీ తరపున బీమా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, విజేతరెడి, మామిడాల మధు, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్షయ్ మహదేవ్‌కి మంత్రి అభినందనలు



జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తాచాటి పలు పతకాలు సాధించిన నెల్లూరులోని లిటిల్ ఏంజెల్స్ విద్యార్థి చాట్ల అక్షయ్ మహదేవ్‌ను మంత్రి నారాయణ అభినందించారు. 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో ఆర్చరీ విభాగంలో అక్షయ్ అద్భుతమైన ప్రతిభతో మూడు పతకాలను గెలుచుకున్నారు. ఇటీవల అక్షయ్ నెల్లూరులోని క్యాంపు కార్యాలయానికి వచ్చి మంత్రి నారాయణ అభినందనలు అందుకున్నాడు. భవిష్యత్తులో అక్షయ్ మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. లిటిల్ ఏంజెల్స్ స్కూల్ కరెస్పాండెంట్ చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## 'డైట్' ప్రిన్సిపాల్ పదవీ విరమణ



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ 'డైట్' విద్యాసంస్థలో గత 36సంవత్సరాలుగా విద్యా శాఖలో డీఇఓగా, ప్రభుత్వ బి.ఇడి కళాశాల ప్రిన్సిపాల్ తదితర అనేక ఉన్నత పదవులు విజయవంతంగా నిర్వహించి, ఇటీవల పదవీ విరమణ చేసిన ప్రధానాచార్యులు డాక్టర్ పూండ్ల రమేష్ సన్మాన కార్యక్రమం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఏఎంఓ జి.సుధీర్‌బాబు, ఇందుకూరుపేట ఎంఇఓలు ఎస్‌వి నాయక్, ఎం.సునీల్‌కుమార్, డైట్ ఉపన్యాసకులు కె.విజయచంద్ర, ఎస్.బి.దాస్, డి.నరసింగరావు, కె.షఫీఅహ్మద్, ఎన్.శివ, బోధనేతర సిబ్బంది, డైట్ విశ్రాంత అధ్యాపకులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొని పూండ్ల రమేష్ సేవలను ప్రస్తుతించారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 1న నెల్లూరులో అవగాహన ర్యాలీ చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ర్యాలీకి జెండా ఊపారు. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. అనేకమంది విద్యార్థులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ, ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఖాదర్‌వలీ, డీసీ హెచ్ఎస్ రమేష్‌నాథ్, గీతాలక్ష్మి పాల్గొన్నారు.

## నీరబ్‌ను కలిసిన దినేష్‌రెడ్డి



ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ని వారి కార్యాలయంలో కలిసి, ఏపీఇఎంసిఎల్ అభివృద్ధి గురించి చర్చించిన ఏపీ స్టేట్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఇఎంసిఎల్) ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి.

## వరదలో చిక్కుకున్న పశువుల కాపర్లు

### ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో కాపాడిన అధికారులు



గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వానలతో ఉగ్రరూపం దాల్చిన పెన్నానది వరద ప్రవాహం పశువుల కాపర్ల పాలిట ప్రాణ సంకటంగా మారింది. ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా పెన్నానది లోనికి వరద నీరు పోటెత్తింది. దీంతో కోవూరు మండలం ఇనుమడుగు సమీపంలోని జమ్మిపాళెం గ్రామానికి చెందిన అయిదుగురు పశువుల కాపర్లు పెన్నానదిలో చిక్కుకుపోయారు. గ్రామస్తుల ద్వారా ఆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెంటనే కోవూరు సి.ఐ సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ నిర్మలానంద బాబాలను హుటాహుటిన సంఘటనా స్థలానికి పంపారు. పశువుల కాపర్లు పెన్నానదిలో చిక్కుకున్న విషయాన్ని ఆమె జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తేవడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక పడవ ద్వారా పశువుల కాపర్లను ఒడ్డుకు చేర్చారు. సకాలంలో స్పందించి పశువుల కాపర్లను కాపాడడంలో చొరవ చూపిన జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసులురెడ్డి, కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ నిర్మలానందబాబాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభినందించారు.

## సురేంద్ర మృతి..పార్టీకి తీరని లోటు!

### ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సంతాపం



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు సంఘ కార్యనిర్వహణ అధ్యక్షులు, బొల్లినేని వెంకటరామారావు కుమారుడు నందమూరి బాలకృష్ణ అభిమాని..టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర మృతి పార్టీకి తీరని లోటని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. కలిగిరి మండలం పెదపాడు గ్రామానికి చెందిన బొల్లినేని సురేంద్ర పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి ఎంతో కృషిచేశారని, చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. సురేంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానన్నారు. వారి కుటుంబసభ్యులకు సురేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నెల్లూరులోని కిసాన్‌నగర్, ప్రశాంతి నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతను తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి-ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు నగర కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి, సునీల్, ధనలక్ష్మి, అవినాష్, అన్నపూర్ణ, మహేంద్ర, డీవీ ప్రసాద్, కావ్యశ్రీ, శ్రీదేవి, రమాదేవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్సుల పేరుతో..

# వందల కోట్లు కాజేశారు

### - 'అరబిందో'పై సోమిరెడ్డి ధ్వజం




అరబిందో సంస్థ ట్రస్టు పేరుతో ఘోరమైన పాపాలు చేసిందని, ఒక్క 104 సంస్థలోనే 175 కోట్లను దోచుకుంటే, 108 సంస్థలో ఇంకెన్ని కోట్లు కాజేసిందోనని మాజీ మంత్రి, టీడీపీ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

అరబిందో కోసమే గత ప్రభుత్వం అంబులెన్సుల అద్దె పెంచేసిందని ఆరోపించారు. ఈనెల 4న ఆయన నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 108, 104 సర్వీసుల నిర్వహణలో ఘోరమైన అక్రమాలు జరిగాయని దుయ్యబట్టారు. 2019లో 108, 104 అంబులెన్సుల బాధ్యతను జీవీకే నుంచి అరబిందో సంస్థ చేజిక్కించుకుందని, ఆ సంస్థ రంగంలోకి దిగినప్పటి నుంచి ప్రభుత్వం చెల్లించే నిర్వహణ ఖర్చులను అమాంతంగా రెట్టింపు చేశారని, ట్రస్టు ఆధ్వర్యంలో సేవా దృక్పధంతో అందించాల్సిన సేవలను అరబిందో దానిని వ్యాపారమయం చేసి, దోపీడీకి పాల్పడిందని విమర్శించారు. 2019 వరకు ఒక్కో 108 అంబులెన్సుకు పాతదైనా, కొత్తదైనా నెలకు జీవీకేకి రూ.1.30 లక్షలు చెల్లిస్తుంటే, అరబిందో వచ్చిన తర్వాత పాత వాహనానికి రూ.2.28 లక్షలు, కొత్త వాహనానికి రూ.1.78 లక్షలకు పెంచారని, 104 అంబులెన్స్ కు నెలకు రూ.1.80 లక్షలు చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. 104 అంబులెన్స్ నిర్వహణకు సంబంధించి అరబిందో సంస్థ రూ.175 కోట్లు అదనంగా వసూలు చేసిందని అధికారుల విచారణలో తేలిందని ఆయన అన్నారు.

### 'గోల్డన్ అవర్' పాటించనే లేదు :

108 సర్వీసులకు సంబంధించి 'గోల్డెన్ అవర్' పాటించలేదని కూడా కాగ్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. రెండున్నరేళ్ల కాలంలో 34 లక్షలకు పైగా కేసులకు సంబంధించి 17.80 లక్షల మంది పేషెంట్ల విషయంలో గోల్డెన్ అవర్ పాటించలేదని వెల్లడించిందని ఆయన వివరించారు. ప్రమాదానికి గురైన బాధితుడు గంటలోపు ఆస్పత్రికి చేరితే గోల్డెన్ అవర్‌గా వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ పరిగణిస్తుందని, అంబులెన్సుకు నెలకు రూ.లక్ష అదనంగా తీసుకుంటున్నా 67శాతం కంటే ఎక్కువ కేసుల్లో గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేర్పించడంలో నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. 108 సర్వీసులకు 731 అంబులెన్సులు ఉంటే, సరైన నిర్వహణ సరిగా లేక రోజుకు సుమారు 150 వాహనాలను సేవలకు వినియోగించలేదన్నారు. పేదల ప్రాణాలను నిర్లక్ష్యం చేసే వారికి గుణపాఠం చెప్పేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడికి, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ప్రభుత్వం, అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇది ఆషామాషీ కేసు కాదు.. సీబీఐ లేదా సీఐడీ ద్వారా సమగ్ర విచారణ జరపించాలని ఆయన కోరారు.

# ఎన్‌బికేఆర్‌లో..భారత నౌకాదళ దినోత్సవ వేడుకలు




భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ఈనెల 4న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో 10-ఏ నావల్ యూనిట్ ఏఎన్ఓ డా. వి.మల్లిఖార్జునరెడ్డి ఎన్‌సిసి విద్యార్థులకు నావికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌సిసి విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఉత్తమ క్యాడెట్‌లకు బహుమతులిచ్చారు. అనంతరం, సీనియర్ కేడెట్స్‌తో కేక్ కట్ చేయించి ఎన్‌సిసిలోకి వస్తున్న కొత్త బ్యాచ్‌ని ఆహ్వానించారు.

# భారీవర్షాల బాధితులకు..రెడ్‌క్రాస్ సేవలు



తుఫాన్ కారణంగా గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలకు బాధలు పడుతున్న నిరుపేదలకు నెల్లూరు రెడ్‌క్రాస్ కమిటీ తనవంతు సేవలందించింది. కూలి పనులకు వెళ్లక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇందిరమ్మ కాలనీ, గాంధీ గిరిజన కాలనీ పేదలకు రెడ్‌క్రాస్ కమిటీ వారు ఇటీవల ఆహారపొట్లాలు అందజేశారు. నెల్లూరు రెడ్ క్రాస్ కమిటీ ఆధ్వర్యంలో, ఐఆర్‌సీఎస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ వారు ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులకు రెడ్ క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, కన్వీనర్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి నెల్లూరు రెడ్ క్రాస్ ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెయ్యి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

## 'నుడా' - నెల్లూరు కార్పొరేషన్‌లపై

# ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం!

తెలుగుదేశం పార్టీలో సంచలనాలకి మారుపేరుగా నిలుస్తూ, తరచూ వైసీపీ నేతలపై విరుచుకుపడుతూ ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న ఆనం వెంకటరమణారెడ్డి ఈసారి ప్రభుత్వశాఖలపై పడ్డారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా ఉన్న నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా), నగర కార్పొరేషన్లపైన కొరడా ఝుళిపించారు. గత సోమవారం ఆయనే స్వయంగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నుడా మరియు నగర కార్పొరేషన్ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి లిఖిత పూర్వక ఫిర్యాదు అందచేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ స్థాయి పదవులని కూడా ఆయన పక్కన పెట్టి, తానే నేరుగా వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

అటు నుడా, ఇటు నగర కార్పొరేషన్ అధికారులపై ఆనం రమణ మండిపడ్డారు. నగరంలో ఇష్టానుసారం అక్రమ లేఅవుట్లకి అనుమతులిస్తున్నారని ఆరోపించారు. మార్టిగేజ్‌లని విడుదల చేయడంలో దొరికిన మేరకు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణ అనుమతులు, అనుమతికి మించిన నిర్మాణాలు వంటి వ్యవహారాలలో కార్పొరేషన్లో అవినీతి తారా



స్థాయికి చేరిపోయిందని అన్నారు. ప్రభుత్వానికి చెందిన 6 ఎకరాల భూమిని లే అవుట్ వేసి అమ్మేసుకున్నారని విమర్శించారు. నుడా, నగర కార్పొరేషన్‌లకి సంబంధించిన అవినీతి భాగోతాలు తన వద్ద కట్టలు కట్టలుగా ఉన్నాయని మీడియాకి చూపించారు. త్వరలో ఆధారాలతో సహా గుట్టు విప్పుతానని హెచ్చరించారు.

మునిసిపల్ శాఖ మంత్రి నారాయణకి చెడ్డపేరు తేవాలని చూస్తున్నారని, అలాంటి వారెవరైనా నారాయణని తాకాలంటే తనని దాటి వెళ్ళాలన్న సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న రోజుల్లోనే నగర కార్పొరేషన్‌కి అవినీతి, అక్రమాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం ఉండేది. నెల్లూరు ముదురు దోమలని తలదన్నే ముదురు మేతగాళ్ళు కార్పొరేషన్లో ఉన్నారు. వాళ్ళకి అవినీతి తిమింగిలాలు అని పేరు పెట్టినా సరిపోదు. అలాంటి వారితో ఆనం వెంకటరమణారెడ్డి ఢీ కొట్టడానికి సిద్ధమయ్యాడంటే సాహసోపేత నిర్ణయమే. "ఎవరో ఒకరు ఎప్పుడో అప్పుడు నడవరా ముందుకు... అటో ఇటో ఎటువైపు" సిరివెన్నెల రాసిన భావోద్వేగ గీతంలోని ఆ ఎవరో ఒకరు ఆనం వెంకటరమణారెడ్డి అయినందుకు సంతోషిద్దాం.

# వీఆర్‌సీలో బీఇడిని పునఃప్రారంభించండి

### - కేంద్ర విద్యామంత్రిని కోరిన ఎంపీ వేమిరెడ్డి



జిల్లాలో ప్రతిష్టాత్మకమైన నెల్లూరులోని విఆర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి బీఇడిని పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కి విన్నవించారు. ఈనెల 5న ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. 2018లో విఆర్‌సీని భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఆ కళాశాల నిర్వహణ కమిటీ స్థానంలో జిల్లా జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ప్రత్యేక అధికారిగా నియమించబడ్డారని, నిర్వహణలో మార్పులు, కరోనా కారణంగా 2022-23 విద్యా సంవత్సరానికి రీజనల్ డైరెక్టర్, ఎస్ఆర్‌సి, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఇ), న్యూఢిల్లీ జారీచేసిన షోకాజ్ నోటీసులకు స్పందించలేకపోయారన్నారు. దాంతో సదరన్ రీజినల్ కమిటీ (ఎస్ఆర్‌సి), ఎన్‌సిటీఇ బీఇడిలో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వలేదని ఆయన కేంద్రమంత్రికి వివరించారు.

విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆఅనుమతులు ఇచ్చేలా ఎస్ఆర్‌సి, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటిఇ) అధికారులకు అవసరమైన సూచనలను జారీ చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. 2024-25 నుంచి బీఇడి కోర్సు ప్రారంభమైతే, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి తప్పకుండా అందుకు తగిన చర్యలు తీసుకుని బీఇడి ప్రారంభం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# విజయాశ్వం

(మొదటిపేజీ తరువాయి)

ఇస్రోకి.. విజయాశ్వంలా పేరొందిన పీఎస్ఎల్‌వి (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) సీరీస్‌లో పీఎస్ఎల్‌వి-సీ59 రాకెట్ ద్వారా, ఐరోపా అంతరిక్ష సంస్థకు చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు రోదసిలోకి విజయవంతంగా పంపడం విశేషం. ఈ రాకెట్‌తో పాటు, ప్రోబా ఉపగ్రహంలో కూడా 'ఆకల్టర్ స్పేస్‌క్రాఫ్ట్', 'కరోనా గ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్' అనే రెండు ఉపగ్రహాలుంటాయి. వీటి బరువు 550 కిలోలు. ఈ రెండు ఉపగ్రహాలు ఒకదానికొకటి సమన్వయం చేసుకుంటూ, ఒక క్రమపద్ధతిలో భూకక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి. ఈ ప్రయోగం ద్వారా అవి ఒక్కోదశను దాటుకుంటూ, భూమినుంచి 60వేల కిలోమీటర్ల దూరానికి చేరి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించే దిశగా ప్రయాణించేలా శాస్త్రవేత్తలు వాటిని రూపొందించారు.

విశ్వంలోని అంతుచిక్కని రహస్యాల అన్వేషణకు, ముఖ్యంగా సూర్యుడి మాటున దాగివున్న రహస్యాలను తెలుసుకునేందుకు, సూర్యుడి వెలుపలి వాతావరణ వలయం 'సౌర కరోనా'పై పరిశోధనలు చేసేందుకు ఈ ప్రయోగం జరిగింది. సూర్యుని భగభగలను తట్టుకుని పరిశోధనలు చేసేందుకు వీలుగా శాస్త్రవేత్తలు ఎంతోకాలంగా అనేకరకాలుగా తమ కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే, భగ్గున మండిపోయే సౌర జ్వాలలు, సౌర తుఫాన్లు వంటివి అంతరిక్ష వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంటాయి కనుక, వీటి పుట్టుక..పరిణామం ఎలా జరుగుతోందో పరిశీలించాలంటే ముందుగా కీలకమైన 'సౌర కరోనా'ను శోధించాలన్నది శాస్త్రవేత్తల ఆలోచన. ఈ నేపథ్యంలో సూర్యుడి వెలుపలి వలయంగా ఆవరించిన 'సౌర కరోనా' స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ 'ప్రోబా-3' పేరుతో రెండు ఉపగ్రహాలను రూపొందించింది. సూర్యునికి వీలైనంత చేరువలో కృత్రిమ సూర్యగ్రహణాలను సృష్టించుకుని, తద్వారా సౌర కరోనాను పరిశీలించేందుకు అత్యంత శక్తివంతమైన ఈ ఉపగ్రహాలు ఉపకరిస్తాయి. ఇలాంటి ప్రయోగం బహుశా అంతరిక్ష చరిత్రలో ఇదే ప్రథమం అని కూడా భావిస్తున్నారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన పీఎస్ఎల్‌వి-సీ 59 రాకెట్ ద్వారా, ఎన్ఎస్ఐఎల్ భాగస్వామ్యంతో ఆ ఉపగ్రహాలను నిర్ధేశిత కక్ష్యలోకి పంపే అద్వితీయ ప్రయోగం దిగ్విజయం కావడంతో అంతరిక్ష శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ముందుగా అనుకున్న ప్రకారం బుధవారమే ఈ ప్రయోగం జరగాల్సి ఉన్నా, చివరి నిమిషంలో వ్యోమనౌకలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని గురువారానికి వాయిదా వేసుకున్నారు. డిసెంబరు 5వ తేదీ గురువారం సాయంత్రం సరిగ్గా 4.04 గంటలకు అనుకున్న సమయానికి రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి కక్ష్యలోకి పంపారు. నాలుగు దశల ప్రయోగం.. ఉత్కంఠభరితంగా ఉంటూ.. ఒక్కొక్కటిగా సఫలీకృతం కావడంతో శాస్త్రవేత్తలను అందరూ కరతాళధ్వనులతో అభినందించారు. పీఎస్ఎల్‌వీ సీరిస్‌లో ఇప్పటిదాకా ఇస్రో నుంచి 60 ప్రయోగాలు జరిగితే, అందులో 57 విజయవంతమయ్యాయి. అందుకే ఇస్రోకి పీఎస్ఎల్‌వీ విజయాశ్వంగా ఉంది. ఈ ప్రయోగం కూడా దిగ్విజయం కావడంతో, ఇస్రో శాస్త్రవేత్తలు మరింతగా ఆనందిస్తున్నారు.

లాయర్
డిసెంబర్ 06, 2024

# అవినీతి భూతం..అభివృద్ధికి విఘాతం!

ఈ భూమండలం మొత్తమ్మీద జనం ప్రాణాలు పీల్చేసిన ఘోరమైన రోగమేదైనా ఉందంటే..అందరికీ ఠక్కున గుర్తుకొచ్చేది కరోనా మహమ్మారే. అదేవిధంగా పీల్చేగాలిని, తాగేనీటిని, తినే తిండినీ..మొత్తంగా పంచభూతాలను కూడా కలుషితం చేసేసి, ధనదాహంతో ప్రజలను పీల్చి పిప్పిచేస్తున్న రాకాసి ఏదైనా ఉందంటే అది..కచ్చితంగా అవినీతి భూతమే!.. ఎక్కడ చూసినా ఇప్పుడు అదే కనిపిస్తోంది. ప్రపంచమంతా వ్యాపించి వికృత తాండవం చేస్తోంది. అవినీతి సూచీలో నూరు పాయింట్లు ఉంటే అవినీతి లేని దేశం అని చెప్పొ, 180 దేశాల్లో గత 'అవినీతి సూచీ' లెక్కలుకడితే, నూటికి నూరు పాయింట్లు ఏ దేశం కూడా సాధించలేదని, ఏ దేశం చూసినా 50 పాయింట్ల కన్నా తక్కువగానే ఉందని పేర్కొంది. అందులో మనదేశం ఇంకా కిందికి పోయి 40 దగ్గరే ఆగివుండడం చూస్తే, ఇక్కడ అవినీతి ఎంత తారస్థాయిలో ఉందో తేటతెల్లమవు తుంది. రానురాను అవినీతి మరింత ప్రబలమై మానవాళి అభివృద్ధికే తీవ్ర విఘాతంగా తయారవుతోంది. దేశమేదైతేనేం.. అవినీతే ప్రధాన జాఢ్యంగా విస్తరిస్తోంది. అవినీతే సర్వాంతర్యామి అయిపోయింది. దాన్ని అరికట్టి, ప్రపంచాన్ని ప్రగతి పథంలోకి తీసుకురావాలనే మహత్తర ఆశయాన్ని మానవాళికి గుర్తు చేస్తూ, ప్రతి ఏటా డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. కానీ, ఎవరెంత పాకులాడినా ఈ అవినీతి జాఢ్యాన్ని ఏమీ చేయలేకపోతున్నారు.

మనదేశంలో మరీ ఘోరం. ఎంతోకాలంగా చెట్టుకు చెద పట్టినట్లు అవినీతి పట్టి పీడిస్తోంది. అది అన్నిరంగాలనీ నాశనం చేస్తోంది. మరోవైపు, ఎక్కడ చూసినా పేదరికం, నిరుద్యోగల, అసమానతలు పెరిగిపోతున్నాయి. కష్టజీవుల జీవితాలు మరింత దుర్భరంగా తయారవుతున్నాయి. పేదరిక నిర్మూలన, అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనే బృహత్తర లక్ష్యాలకు ఈ అవినీతే తూట్లు పొడుస్తోంది. అవినీతి వల్లనే దేశం ఏటా లక్ష కోట్ల రూపాయలకుపైగా కోల్పోతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కల్తీల మాయాజాలం, ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రబలడం, అసమానతలు పెరిగి పోవడం వంటి సమస్యలన్నిటికీ అవినీతే మూలం. ముఖ్యంగా పభుత్వాలు, పాలకవర్గాల్లో ఉన్నవారిలో కూడా అత్యధికశాతం మంది అవినీతికి అంటకాగుతున్నారు. వారికి సహకరిస్తూ ఉన్నత స్థాయి అధికారులు కూడా వారికి అంటుమొక్కలవుతున్నారు. ప్రతిదీ అవినీతి రాజకీయమే అయిపోయింది. ఏళ్ళు గడిచి పోతున్నా పటిష్టమైన అవినీతి నిరోధక విధానాలు మనదేశంలో కలికానికి కూడా కనిపించడం లేదు. ప్రజలకు కనీస సదుపాయాలు లేకున్నా, తాగేందుకు మంచినీరు కూడా దొరకకున్నా ఎవరికీ పట్టడం లేదు. రోజంతా కష్టించిపనిచేసే పేదలు, కార్మికులు, కర్షకుల కష్టాలు పట్టించుకోకుండా ఎవరిపాటికి వారు అవినీతిమడుగులో మునకలు వేస్తుంటారు. పెద్ద పెద్ద అవినీతి కేసులు కూడా విచారణకు రావడానికి మనదేశంలో ఏళ్ళతరబడి కాల యాపన జరుగుతూనే ఉంటుంది. మోసాలు చేసేవారు, అన్యాయాలకు పాల్పడేవారు, అరాచకాలు, అవినీతితో బతికేవారే మనదేశంలో దొరలుగా తిరుగుతున్నారు. కల్తీలు, నాసిరకం వస్తువులు మార్కెట్లలో కుప్పలు తెప్పలుగా ఉంటున్నా, వ్యాపారులు లంచాలిచ్చి కోట్లు గడించేస్తున్నా, అవినీతి మత్తులో జోగుతున్న అధికారులు అసలు పట్టించుకోరు. రాజకీయాల్లో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారుతున్నా ప్రభుత్వాల్లో చలనం ఉండడం లేదు. ప్రభుత్వం వేలకు వేలు జీతాలిస్తున్నా.. కొంతమంది అధికారులు లంచాలు మరిగి పేదసాదా అన్న తేడా కూడా లేకుండా చేతులు తడిపితే తప్ప పనిచేయడం లేదు. 'నీకిది..నాకిది' అంటూ ఎవరికి వారు కోటాను కోట్ల అవినీతి డబ్బు పంచుకుంటూ, నీతిని - న్యాయాన్ని- ధర్మాన్ని నంజుకుతినే లంచావతారాలకు, అవినీతి తిమింగిలాలకు మనదేశంలో అడ్డే లేకుండా పోతోంది. ఇదే అదనుగా ప్రజలను పీడించే అనేకమంది నాయకులు ఆ అవినీతి దన్నుతో చట్టసభల్లో దూరి, ప్రజలను పీడిస్తున్నారు. కొండలు కోనలు, గుట్టలు-గనులు, ప్రకృతినంతా కొల్లగొట్టేసి కోట్లకుకోట్లు మింగేసినా ఎవరూ పట్టించుకోని 'ధనస్వామ్య' దేశం మనది.

ఈ అవినీతి కారణంగానే ఎంతోమంది ప్రతిభకల యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. ఈ రాకాసి వల్లనే పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోతున్నారు. ఈ మహమ్మారి మూలంగానే దేశాభివృద్ధి కుంటుపడుతోంది. ఇకనైనా, ప్రజలు, ప్రభుత్వాలు, పాలకులు మేలుకోవాలి. అవినీతి భూతాన్ని తరిమికొట్టాలి. దానికి వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ ఉద్యమించాలి. పవిత్రమైన మన భారతదేశాన్ని అవినీతిమయం కాకుండా కాపాడుకోవాలి!...

**-(డిసెంబరు 9, అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం)**

## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 67

# అయ్యోర్లకి 'యాప్'ల భారం.. చిన్నారులకి చదువులు దూరం!

"ఎవరు చేయాల్సిన పనులు వాళ్ళే చేయాలి" అని మన పెద్దలు ఊరక అనలేదు. ఒకరు చెయ్యాల్సిన పనిని మరొకళ్ళు చేస్తే మంచి ఫలితాలు ఉండవన్నది వారి అనుభవం.

నిజమే!.. ఎవరికి ఏ పనిలో జ్ఞానం, అనుభవం ఉంటాయో..వాళ్ళు ఆ పనులు చేస్తేనే ఫలితం, ప్రయోజనం. అలాకాకుండా కొంతమందికి ప్రవేశం, ప్రావీణ్యం లేని పనులను వాళ్ళని తప్పనిసరిగా చేయాల్సిందేనంటూ బలవంత పెట్టి నెత్తిన రుద్దితే మొదటికే మోసం వస్తుంది.

ఇప్పుడు సరిగ్గా అలాంటి తంతే మన రాష్ట్రంలోని విద్యావ్యవస్థలో జరుగుతోంది. ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు అంటున్నాం. 'ఆచార్యదేవో భవ!'.. అని పూజించుకుంటున్నాం. కానీ, ఆచరణలో మాత్రం అదే గురువులను అన్నివిధాలా ఇబ్బందులు పెడుతున్నాం. గత ప్రభుత్వం ఇదే సిద్ధాంతాన్ని ఆచరించింది. చదువులు పక్కనపెట్టి అయ్యవార్లచేత అడ్డమైన చాకిరీ చేయించుకుంది. బోధనని గాలికి వదిలి ప్రభుత్వ టీచర్ల చేత ఇతర శాఖలకు సంబంధించిన పనులకు వాడుకుంది. జనాభాలెక్కలు, ప్రభుత్వ పనితీరుపై సర్వేలు, ఓటరు నమోదు కార్యక్రమాలతో పాటు ఇంకా అనేక అడ్డగోలు పనులను వాళ్ళకి అప్పచెప్పారు. 'గురువులంటే కాదే పనులకీ అనర్హం' అన్నట్లుగా వారిని వాడేసుకుంటున్నారు.

అయ్యవార్లంటే భావిభారత పౌరులను తీర్చిదిద్దే మార్గదర్శకులు. రేపటి పౌరులకి విద్యాబుద్ధులతో పాటు, మంచి చెడులను బోధించే దైవస్వరూపాలు. అలాంటి అయ్యవార్లని ప్రభుత్వం పక్కదారి పట్టించింది. బోధనేతర సిబ్బంది చేయాల్సిన పనులని, పాఠాలు నేర్పాల్సిన అయ్యవార్లకి అప్పగించింది. వారికి సంబంధంలేని పనులతో వారిని పరుగులు పెట్టించింది. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల పిల్లల చదువు అటకెక్కింది. వారి ఉజ్వల భవిష్యత్తు అంధకారమయ్యింది. గత పాలకుల మూర్ఖపు పోకడ కారణంగా విద్యావ్యవస్థ మొత్తం అస్తవ్యవస్థమై నిర్వీర్యమైపోయింది.

### కాలంతో పాటు మార్పులు...!

కాలం మారుతూ వస్తోంది. పలకల నుండి నోట్ బుక్కులకి, అక్కడ నుండి కంప్యూటర్లకి, దాని నుండి ట్యాబ్లకి, వాటి నుండి సెల్‌ఫోన్‌లకి అక్షరాలు బదిలీ అవుతూ వచ్చాయి. విద్యావ్యవస్థ స్వరూపం కూడా ఆధునిక కాలానికి అనుగుణంగా మార్పులు సంతరించుకుంటోంది. చెట్ల కింద చదువులు రేకులషెడ్లలోకి, వాటి నుండి బహుళ అంతస్తుల భవనాలలోకి, అక్కడనుండి ఎయిర్ కండిషన్ గదులలోకి మారాయి.

ఆధునిక తరం పిల్లల సంగ్రాహక శక్తి కూడా పెరిగింది. ఆలోచనా సరళి మారింది. వయసుకు మించిన జ్ఞానం వారిలో కనిపిస్తోంది. ఊహకందని మేధోశక్తి వారిలో వికసిస్తోంది. తమకి పాఠాలు బోధించే గురువుకే తెలియని విషయాలు చెప్పగలిగే స్థాయిలో ప్రస్తుత తరం చిన్నారులు తమ ప్రతిభా పాటవాలు చూపిస్తున్నారు. పరిపూర్ణ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలలలో జరగవలసిన స్థాయిలో మార్పులు జరగడం లేదు. బోలెడు డబ్బులు ధారబోసి ఆధునిక వసతులని పాఠశాలలకి కల్పిస్తున్నా.. వాటికి తగ్గట్లుగా సిబ్బందిని నియమించడంలేదు. ప్రచార ఆర్భాటం కోసం కోట్లు కుమ్మరించి అత్యాధునిక సాంకేతిక పరికరాలు కొనుగోలు చేసి పాఠశాలలకి పంపిస్తున్నారు. వాటిని సక్రమంగా వినియోగించడానికి కావలసిన సిబ్బందిని నియమించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో ఒక్కొక్క సహాయకుడిని నియమిస్తే, కొన్నివేల మంది సాంకేతిక నిపుణులకు, ఇంజనీరింగ్ పట్టభద్రులకి ఉపాధి దొరుకుతుంది. కానీ మన ప్రభుత్వాలు అలా చేయకుండా 'చెయ్యి ఖాళీగా ఉంది కదా.. పొయ్యిలో పెట్టు'.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పాఠాలు చెప్పడానికి నియమింపబడిన సాదా సీదా బీఈడీ అయ్యవార్లనే ఇంజనీర్ల అవతారం ఎత్తమంటున్నారు.

### బడికి వచ్చినప్పటినుంచి బోలెడు పనులు :

పాతకాలంలో అయ్యవార్లు బెత్తం తీసుకుని పిల్లలకు పాఠాలు చెప్పడం, వారిని క్రమశిక్షణతో ఉంచడం తప్ప వేరే వ్యాపకం వుండేది కాదు. కాబట్టే అప్పటి చదువులు చాలా బాగుండేవి. అయ్యవార్లంటే విద్యార్థినీవిద్యార్థులకి భయభక్తులుండేవి. ఇప్పుడవన్నీ గతకాలపు జ్ఞాపకాలే!

ప్రస్తుత కాలంలో అటెండెన్స్ రిజిస్టర్ చెత్తబుట్టకి చేరింది. ఇప్పుడంతా కెమెరాలముందు ముఖం చూపించడమే. రోజూ ఎంతమంది పిల్లలు బడికి హాజరవుతున్నారు? మధ్యాహ్నం పిల్లలకి ఏం భోజనం పెడుతున్నారు? ఏమేం కూరలు వడ్డిస్తున్నారు? ఎన్ని గుడ్లు పెడుతున్నారు? చిక్కీల నాణ్యత ఎలా ఉంది? ఇదంతా పర్యవేక్షించాల్సింది కూడా అయ్యవార్లే. ఆ వివరాలన్నీ సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ అంత తొందరగా అయ్యే పనులు కావు. పేరుకి డిజిటైలేషన్ ద్వారా పని సులభతరం చేసేస్తున్నాం అని గొప్పలు చెప్పుకోవాల్సిందే. ఈ వివరాలన్నింటినీ కాగితంపై పెట్టడం కోసం పట్టే టైం కన్నా ఎక్కువ సమయమే పడుతుంది. సదరు వివరాలన్నింటినీ యాప్‌లలో అప్‌లోడ్ చేసే సమయానికి ఇంటర్‌నెట్ కనెక్ట్ కాకపోతే రోజంతా తిప్పలే. హెడ్మాస్టర్లకి, వారికి సహకరించే అయ్యోర్లకి ఉన్న పుణ్యకాలమంతా వీటితోనే సరిపోతోంది. అదే ప్రైవేట్ స్కూళ్లలో అయితే అలాంటివన్నీ చూసేందుకు ప్రత్యేకంగా అడ్మినిస్ట్రేషన్ విభాగ సిబ్బంది ఉంటారు. అదే తరహాలో ప్రభుత్వ విద్యాలయాల్లో కూడా అదనపు వ్యవహారాల ఆలనాపాలనా చూసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించడం చాలా అవసరం.

### ప్రభుత్వాల తీరు మారాలి

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులంటూ ఉపాధ్యాయ దినోత్సవం నాడు గొప్పలు చెప్పే నాయకులు, ఆచరణలో అయ్యవార్ల మీదనే బెత్తం పట్టుకునే విధానాలు అవలంభిస్తుండడం విడ్డూరం, విచారకరం. ఈ నేపథ్యంలో, పిల్లలు పెడమార్గం పట్టకుండా, ఉత్తమంగా రాణించాలంటే, గురుతరమైన బాధ్యత నిర్వర్తించాల్సింది అయ్యవార్లే. అయితే, పిల్లలకు చదువు చెప్పడం కంటే.. ఇతరత్రా పనుల్లోనే అయ్యవార్ల సమయం వృథా అయిపోతుంటే, పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది. కొత్త ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టిపెట్టాలి. అర్థరహితమైన పాత విధానాలన్నిటినీ పరిశీలించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. అయ్యవార్లకి యాప్‌లు, అప్‌లోడ్‌ల బాధలన్నీ తొలగించి, ఉపాధ్యాయ వ్యవస్థ స్ఫూర్తిదాయకంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలి. ప్రతి బడీ.. చదువుల తల్లి గుడిలా కళకళలాడే విధంగా విద్యావ్యవస్థను పునరుజ్జీవింపజేయాలి.

**- రాజశ్రీ**

# 'పుష్ప' సినిమా టిక్కెట్లు.. ప్రభుత్వాలే బ్లాకులో అమ్మిస్తున్నాయి!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

ఏదైనా ప్రముఖ హీరో సినిమా విడుదలైనప్పుడు బ్లాకు టిక్కెట్ల దందా జోరుగా జరుగుతుంది. గతంలో బాహుబలి సినిమా వచ్చినప్పుడు 100 రూపాయల టిక్కెట్టు 1000 రూపాయలు కూడా పలికింది. అలా బ్లాకు టిక్కెట్ల తంతు పెద్ద హీరోల సినిమాలు వచ్చినప్పుడల్లా జరుగుతూనే ఉంటుంది. ఇది సర్వసాధారణమే. తాజాగా 'పుష్ప-2' సినిమా టిక్కెట్లని ఏకంగా వెయ్యి రూపాయలకి అమ్ముకోవచ్చని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలే అధికారికంగా అనుమతులు ఇవ్వడం విడ్డూరంగా ఉంది. విడుదలకి ఒకరోజు ముందు ఆ తరువాత కొద్ది రోజులు టికెట్లపై అదనంగా వసూలు చేసుకోవచ్చని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ జీవోలు జారీచేసి మరీ అనుమతులు ఇచ్చాయి. అంటే, ఎగ్జిబిటర్లే బ్లాకులో అమ్ముకోవచ్చని పర్మిషన్ ఇచ్చినట్లన్నమాట.

ఈ సినిమా కోసం హీరో అల్లు అర్జున్ 300కోట్లు పారితోషికంగా తీసుకున్నాడని కూడా సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అదే సమయంలో చిత్రం విడుదల కాకముందే 'పుష్ప -2' వెయ్యికోట్ల వ్యాపారాన్ని దాటేసిందని దర్శక, నిర్మాతలే ప్రకటించుకున్నారు. ఇంత భారీస్థాయిలో నిర్మాతకి లాభాలు వసూలు చేసిన తొలి తెలుగు సినిమా ఇదే అని కూడా ప్రచారం చేసుకుంటున్నారు. తీరా సినిమా విడుదలయ్యే సమయానికి సామాన్యుల జేబులు కూడా కొల్లగొట్టడానికి చిత్ర బృందం ప్రభుత్వాల నుండి అనుమతి తీసుకుంది. పైగా "రేట్లు పెంచేది పెంచేదే-ఇష్టమైతే చూడండి లేదంటే రేట్లు తగ్గే వరకు ఆగండి" అంటూ రాంగోపాల్ వర్మ లాంటి తలతిక్క డైరెక్టర్లు స్టేట్మెంట్లు కూడా ఇస్తున్నారు. బ్లాక్ టిక్కెట్ల దందాని అడ్డుకోవలసింది పోయి ప్రభుత్వాలే అధికారికంగా 'రేట్లు పెంచి అమ్ముకోండి' అని ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటైన విషయం. సినిమాపై వున్న మోజుని సొమ్ముచేసుకోవడం కోసం నిర్మాతలు, పంపిణీదారులు, ఎక్సిబిటర్‌లు చేస్తున్న ప్రయత్నానికి ప్రభుత్వాలు వంతపాడటం అన్యాయం, అర్థరహితం!

**- డి.హరిత, గూడూరు.**

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం

మన పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో ముస్లిమేతర మతాల వారిపై జరుగుతున్న దాడులు అమానుషం. ముఖ్యంగా హిందువులపై అక్కడి ముస్లిములు చేస్తున్న దమనకాండ హేయనీయం. అక్కడ ఒక జాతి మతోన్మాదులు తమ ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. తాము ఫలానా మతమని చెప్పుకోవడానికి సైతం ఆ ముస్లిమేతరులు వణికిపోయే స్థాయిలో వారిపై దౌర్జన్యకాండని కొనసాగిస్తున్నారు. వారి ఇళ్ళని తగలబెడుతున్నారు. వారి వ్యాపారాలపై మూకుమ్మడి దాడులుచేసి కొల్లగొడుతున్నారు. ఆ దేశంలోని కొంత మంది రాజకీయవాదులు తమ స్వార్థంకోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రక్తపాతం సృష్టిస్తున్నారు. తమ వికృత రాజకీయ క్రీడలో అమాయక జనాన్ని పావులు చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామం. ముఖ్యంగా పక్కనే ఉన్న భారతదేశానికి ఇది అస్సలు మంచిదికాదు. అంతర్జాతీయస్థాయిలో చర్చలు జరిపి ఈ అంశానికి తెరదించాలి. బంగ్లాదేశ్‌లో శాంతిని నెలకొల్పి పరిస్థితులని సాధారణ స్థితికి తీసుకురావాలి. ఆ దిశగా భారత ప్రభుత్వం కూడా చొరవ చూపి త్వరతగతిన సమస్యకి శాశ్వత పరిష్కారం కనుగొనాలి.

**- యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

# గ్రంథాలయాలకు వీడని గ్రహణం

## నిధులు లేవు!.. సెస్సులు రావు!

- బకాయిలు కోట్లకు చేరుతున్నా..పట్టించుకోని అధికారులు



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలంటూ పొగుడు కోవడమే తప్ప, వాటి ఆలనాపాలనా చూసే నాథులు లేకపోవ డంతో, రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అందులోనూ, ప్రాచీనకాలం నుంచి 'విద్యాభూమి'గా పేరెన్నికగన్న నెల్లూరు జిల్లాలో గ్రంథాలయాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. దీర్ఘకాలంగా అటు అభివృద్ధికి, ఇటు నిర్వహణకు అవసరమైన నిధులు లేకపోవడంతో గ్రంథాలయాలు క్రమేణా పాడుబడిపోతున్నాయి. ఎంతో అపురూపమైన గ్రంథాలు చెదలుపట్టిపోతున్నాయి. స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయాలకు రావాల్సిన బకాయిలు కోట్లకు చేరుకుంటున్నా అటు ఆయా సంస్థల వారు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడంతో గ్రంథాలయాల స్థితి రానురాను మరింత దీనంగా.. దయనీయంగా మారుతోంది.

గ్రంథాలయాల అభివృద్ధికి స్థానిక సంస్థల నుంచి వచ్చే సెస్సులో కీలకం. అయితే, ఆ సంస్థలు మాత్రం సకాలంలో సెస్సులను చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయి. నిధుల కోసం స్థానిక సంస్థల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడాల్సి వస్తుండడం, ఆ సంస్థలు సెస్సులు చెల్లించకపోయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏళ్ళతరబడిగా జరిగిపోతూనే ఉంది. దీంతో, నిధులు లేక.. సెస్సులు రాక గ్రంథాలయాలు ఘోరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కూటమి ప్రభుత్వమైనా పెద్దమనసుతో ఆలోచించి వాటి అభివృద్ధికి శాశ్వతప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

### నిధులు లేక నీరసం :

'చిరిగిన చొక్కా అయినా వేసుకో..ఓ మంచి పుస్తకం కొనుక్కో'.. అంటుంటారు పుస్తకాభిలాషులు. పుస్తకాలంటే ఎంత ప్రీతికరమైనవో వాటిని చదివేవారికే తెలుస్తుంది. గ్రామగ్రామానా ప్రజలకు విజ్ఞానం అందించాలనే తపనతో స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచీ గ్రంథాలయోద్యమం మొదలైంది. అప్పట్లో..ఎవరో కొందరు గొప్పవారిళ్ళలో మాత్రమే లైబ్రరీలుండేవి. పుస్తకాలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి కావు. ఆ తర్వాత క్రమేణా ఎందరో త్యాగధనులు, మహనీయుల కృషి ఫలితంగా గ్రంథాలయాలు ఊరూవాడా వెలిశాయి. ప్రభుత్వాలు కూడా అప్పట్లో గ్రంథాలయాలను బాగా ప్రోత్సహించేవి. పంచాయతీలు, మునిసిపాలిటీలకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని..అంటే రూపాయికి 8 పైసల వంతున సెస్సు రూపంలో గ్రంథాలయాలకు చెల్లించి, వాటి అభివృద్ధికి సహకరించాలని 1961లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ యాక్ట్ కూడా వచ్చింది. అయితే, కాలక్రమేణా గ్రంథాలయాల అభివృద్ధిని స్థానిక సంస్థలు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నాయి. ప్రజల నుంచి పన్నులు వసూలుచేసుకుంటున్నా, గ్రంథాలయాల సెస్సుల విషయంలో మాత్రం అలక్ష్యంగా ఉంటున్నాయి. సెస్సు బకాయిలు ఇవ్వకుండా ఏళ్ళతరబడిగా ఎగనామం పెడుతుండడంతో, ఆ బకాయిలు భారీగా పెరిగిపోతున్నాయి. ఇటీవలి కాలంలోనైతే బకాయిల మొత్తాలు కోట్లకు చేరుకుంటున్నా, ఆయా సంస్థల్లోని అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. దీంతో, విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలు నిధులు లేక నీరసంతో బిక్కచచ్చి బక్కచిక్కిపోతున్నాయి.

### శిథిలావస్థలో సరస్వతీ నిలయాలు :

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 61 శాఖా గ్రంథాలయాలున్నాయి. వాటికి కేంద్రంగా జిల్లాకేంద్రమైన నెల్లూరులో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉంది. స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలో ఉన్న ఆ కేంద్రగ్రంథాలయం భవనం పాతబడిపోవడంతో దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు గత ప్రభుత్వంలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 2019లో అట్టహాసంగా శంకుస్థాపన కూడా చేశారు. అప్పట్లో దాని అంచనా వ్యయం రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత ఏముంది?..షరా మామూలే. నిధులు లేకపోవడంతో ఆ నిర్మాణం పని మూలన పడింది. ఇప్పటికీ ఆ భవనానికి దిక్కులేదు. జిల్లా కేంద్ర గ్రంథాలయం స్థితే అంత ఘోరంగా ఉంటే, ఇక మామూలు శాఖా గ్రంథాలయాలను పట్టించుకునే నాథులెవరు?..ఇప్పటికే సైదాపురం, అనుమసముద్రంపేట, ఇందుకూరుపేట, పొదలకూరు, మనుబోలు, చెన్నారాయునిపాళెం, అల్లూరు తదితర గ్రామాల్లో గ్రంథాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. వాటి భవనాలు వానకు ఉరుస్తూ, పుస్తకాలు తడుస్తూనే ఉన్నాయి. పైన పెచ్చులూడిపోతున్నాయి.. ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లుగా భయపెడుతున్నాయి. వీటిని మరమ్మతులు చేయాలంటే కనీసం మూడు నాలుగు కోట్లన్నా అవుతాయి. నిధులు ఇచ్చే వారెవరు?.. ఆ గ్రంథాలయాలను బాగుచేసేవారెవరు?...

### కనీస సదుపాయాలు కరువు :

గ్రంథాలయాల నిర్వహణ మాటలతో పనికాదు. వేళకు తెరవాలి.. పాఠకులకు కనీస వసతులు కల్పించాలి. పుస్తకాలను చినిగిపోకుండా భద్రపరచాలి. ఏఏ పుస్తకాలున్నాయో క్యాటలాగులు తయారుచేయాలి. అవసరమైనవారికి జెరాక్స్ తీసిచ్చే విధంగా, కంప్యూటర్లు వగైరా పరికరాలుండాలి. ఇదంతా ఒక పెద్ద వ్యవస్థ. వాటన్నిటికీ నిధులు లేకుంటే చెప్పలేనంత అవస్థ. పుస్తకపఠనంపై ఆసక్తి ఉండే ఎందరో విద్యార్థులు, యువత, పెద్దవాళ్లు కూడా నిత్యం లైబ్రరీలకు వస్తూనే ఉంటారు. పాత్య పుస్తకాలు, కొత్త పుస్తకాలు, మంచి మంచి గ్రంథాలు తీసుకుని చదువుకుంటుంటారు. అయితే, అందరికీ విజ్ఞానం పంచే గ్రంథాలయాల ఉద్యోగులకు మాత్రం జీతాలు సక్రమంగా రావు. వస్తే వస్తాయి..లేకుంటే లేదు. అలాగే వాళ్లు రిటైరైపోతుంటారు కూడా. జిల్లాలో అలా రిటైరైన గ్రంథాలయ ఉద్యోగులకు రావాల్సిన వేతనాలు వగైరాలన్నీ కలిసి కోటీ 50 లక్షలకు పైగానే బకాయిలున్నాయంటే, వారి విశ్రాంత జీవితాలు ఎంత అశాంతిగా, ఎంత అస్తవ్యస్తంగా ఉంటాయో అర్థంచేసుకోవచ్చు.

### కోట్లల్లో బకాయిలు..

### అభివృద్ధికి నోచని గ్రంథాలయాలు

పుస్తక విజ్ఞానం జీవితాలకు వెలుగులు పంచుతుంది. సద్గ్రంథ పఠనం సేవాభావాన్ని అలవరుస్తుంది. సమాజానికి ఎంతో ఉపయుక్తమైన గ్రంథాలయాల అభివృద్ధికి అటు ప్రభుత్వం నుంచి కానీ, ఇటు జిల్లాల్లోని ఉన్నతాధికారుల నుంచి కానీ ఎలాంటి సహకారం ఉండకపోవడం విచారకరం. జిల్లాలో ఏడాదికేడాది గ్రంథాలయాల సెస్సు బకాయిలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. ఒక్క నెల్లూరు నగర కార్పొరేషన్ నుంచే జిల్లా గ్రంథాలయాల సంస్థకు దాదాపు 35 కోట్ల రూపాయలకు పైగానే బకాయి ఉందంటే, అవి ఏ స్థాయిలో పెరిగిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక గ్రంథాలయాలకు నిధులెక్కడినుంచి వస్తాయి?.. మునిసిపాలిటీల్లో ఒక్క సూళ్ళూరుపేట మాత్రం ఎలాంటి బకాయిలు పెట్టకుండా ఎప్పటికప్పుడు గ్రంథాలయాల సెస్సు చెల్లించేస్తుండడం అభినందించదగ్గ విషయం. గూడూరు మునిసిపాలిటీ నుంచి కోటీ 4 లక్షలకు పైగా బకాయిలున్నాయి. అదేవిధంగా, ఆత్మకూరు మునిసిపాలిటీ 69 లక్షలు, వెంకటగిరి 59 లక్షలు, కావలి 56 లక్షలు, నాయుడుపేట 40 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 15 లక్షలు, అల్లూరు నగరపంచాయతీ 5 లక్షల వంతున బకాయిలున్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీలన్నీ కలిసి సుమారు మరో కోటీ 26లక్షల రూపాయలకు పైగానే బకాయిలున్నాయి. ఇవన్నీ వచ్చేదెప్పుడు?..గ్రంథాలయాలు బాగుపడేదెప్పుడో ఆ దేవుడికే తెలియాలి. జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉన్నత విద్యావేత్త.. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే తప్ప ఈ సమస్య ఒక కొలిక్కి రాదు. స్థానిక సంస్థలు నిర్దిష్ట కాలానికి బకాయిలు తప్పనిసరిగా గ్రంథాలయాలకు చెల్లించాలని చట్టాన్ని సవరిస్తే తప్ప ఈ దుస్థితి మారదని అంటున్నారు. ప్రభుత్వం పరిశీలించాలి మరి!...

# జనవరి నుంచి.. రాజధాని పనులు

## పురపాలక మంత్రి నారాయణ వెల్లడి



వచ్చే జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు మొదలవుతాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. డిసెంబరు నెలాఖరుకల్లా 360 కిలోమీటర్ల ట్రంక్‌రోడ్లు, మిగతా టవర్ల నిర్మాణాలకు టెండర్లు పూర్తవుతాయని, గతంలో నిలిచిపోయిన పనులకు సంబంధించిన టెండర్‌ల ఒప్పందాలు రెండు మూడు రోజుల్లో రద్దుచేసి, కొత్తగా టెండర్లు పిలుస్తామని తెలిపారు. రాజధానిలో సంస్థలకు భూ కేటాయింపులపై వేసిన కేబినెట్ సబ్‌కమిటీ సచివాలయంలో ఇటీవల సమావేశమైంది. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్రతో పాటు అధికారులు, మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, దుర్గేష్, సంధ్యారాణి ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వం మూడు ముక్కలాట వల్ల రాజధానిలో కార్యాలయాల ఏర్పాటుకు సంస్థలు ముందుకు రాలేదని, 2019కి ముందు 131 సంస్థలకు భూములు కేటాయిస్తే, వాటిలో కొన్ని మాత్రమే తమ కార్యాలయాలు ఏర్పాటు ప్రారంభించాయని తెలిపారు. అయితే ఆయా సంస్థలకు కేటాయించిన భూములకు సంబంధించి కాలపరిమితి ముగియడంతో తిరిగి వారి నుంచి రాత పూర్వకంగా అంగీకారం తీసుకుంటున్నామన్నారు

### భారీస్థాయిలో ఇఎస్ఐ ఆసుపత్రి, వైద్యకళాశాల :

అమరావతిలో భారీ స్థాయిలో ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్యకళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వంలో భూములు పొందిన సంస్థలకు పూర్తి అంగీకారం తెలుపుతూ మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుందన్నారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్స్ అండ్ డిజైన్(సీఐటీడీ)కి 5 ఎకరాలు, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఐజీఎన్ఓయు)కి 0.8 ఎకరాలు, బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కి 15 ఎకరాలు, లార్సన్ అండ్ టర్బో స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కి 5ఎకరాలు, బ్రహ్మకుమారి ఎడ్యుకేషన్ సొసైటీకి 10 ఎకరాలు కేటాయించినట్లు చెప్పారు. టీటీడీకి గతంలో కేటాయించిన 25 ఎకరాలకు పూర్తి అంగీకారం తెలిపామని, అయితే గతంలో ఇచ్చిన వారికి అప్పటి ధరలకే భూములు ఇస్తున్నామని వివరించారు. కొత్తగా భూ కేటాయింపులు చేసే సంస్థలకు ధరల అంశంలో ఒక పాలసీ తయారు చేస్తామన్నారు.

# తుఫాన్ గాలులు.. భారీ వానలు

- స్తంభించిన జనజీవనం
- రైతులకు తీరని నష్టం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావంతో ఫెయింజల్ తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. తుఫాన్ గాలులు, భారీ వానలతో జనజీవనం స్తంభించింది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లా రైతాంగానికి నష్టాలు తప్పలేదు. తుఫాను తీరం దాటినా జిల్లాలో ఇంకా ఎడతెరపి లేకుండా వానలు కురుస్తూనే ఉన్నాయి. ఈనెల 3న భారీ వానలు కురవగా, 4వ తేదీ బుధవారం కూడా వాన జల్లులు కురిశాయి. జిల్లా అంతటా ముసురు వాతావరణం కనిపిస్తోంది. నెల్లూరు నగరంలో కూడా ఒకటే వాన. కాసేపు తెరపిచ్చినా మళ్ళీ జోరు వాన కురుస్తుండడంతో ప్రజలు ఇళ్ళల్లోంచి బయటకు పోలేక ఇబ్బందులు పడ్డారు. ఈనెల 3వతేదీ మంగళవారం జిల్లాలో సరాసరి 22.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా సీతారామపురంలో 69.2 మిల్లీమీటర్లు, ఉదయగిరిలో 55.4, వరికుంటపాడులో 41.8, దుత్తలూరులో 40 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈనె 3వ తేదీ నాటికి 1226 హెక్టార్ల పంటలు నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా కట్టారు. 15 మండలాల్లో వర్షం తీవ్రత వల్ల 180 హెక్టార్లలో వరి నారుమళ్ళు, 1003 హెక్టార్లలో వరి పైరు, 50 హెక్టార్లలో వేరుసెనగ పంట, 17 హెక్టార్లలో మినుము, మరో 10 హెక్టార్లలో కందిపంట దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. అయితే, పూర్తిస్థాయి నష్టాలు త్వరలో వెల్లడవుతాయని భావిస్తున్నారు.

### సోమశిల డ్యామ్‌కు వరదనీటి ఉధృతి

ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని జలాశయాలు, నదులు, చెరువులు దొరువులన్నీ పుష్కలంగా నీటితో నిండిపోతున్నాయి. జిల్లాలోని ప్రధానమైన సోమశిల డ్యామ్‌కు వరదనీటి ఉధృతి బాగా పెరుగుతోంది. ఈనెల 3వ తేదీ 10,664 క్యూసెక్కుల నీటిప్రవాహం వచ్చింది. డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఇప్పటికే 70.343 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో దిగువ ప్రాంతాలకు అవసరమైన నీటిని వదులుతున్నారు. కండలేరు డ్యామ్‌కు 2వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, పెన్నా డెల్టాకు 1800 క్యూసెక్కుల వంతున నీటిని మంగళవారం నాడు విడుదల చేశారు.

# మాగుంట సేవలు మరపురానివి



ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు, దివంగత నేత మాగుంట సుబ్బరామరెడ్డి ప్రజలకు చేసిన సేవలు మరపురానివని వక్తలు కొనియాడారు. మాగుంట సుబ్బరామరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా ఈనెల 1న నెల్లూరు పొగతోటలో ఉన్న ఎస్-2 సినిమాహాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్ తదితరులు పాల్గొని సుబ్బ రామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాసేవలో తన జీవితాన్ని ధన్యం చేసుకున్న, మాగుంట సేవలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని అన్నారు. పత్తి రవీంద్రబాబు రఘురాం ముదిరాజు, బాలసుధాకర్, ఓబుల్‌రెడ్డి, నరసింహారావు, పుట్టా విజయ్ కుమార్‌రెడ్డి, కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సురేందర్‌రెడ్డి, ఎస్-2 సిబ్బంది తదితరులు పాల్గొని మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలను స్మరించుకున్నారు.

మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని సుబ్బరామన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ మాగుంటకు నివాళు లర్పించిన వారిలో ఏపీ స్టేట్ ఎంయంఎస్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మెన్ ఏసునాయుడు తదితరులు ఉన్నారు.

# బాలసంస్కార కేంద్రానికి.. 50 వేల విరాళం



నెల్లూరులోని సింహపురి వైద్య సేవా సమితి ట్రస్ట్ (జయభరత్ హాస్పిటల్) వారు గిరిజన కాలనీలలో పిల్లల అభ్యున్నతి కోసం నిర్వ హిస్తున్న బాల సంస్కార కేంద్రానికి నెల్లూరు నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ టీవీ కోటేశ్వరరావు ఇటీవల 50,000 రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు విరాళం చెక్కును జయభరత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌కు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వర రావు మాట్లాడుతూ, తమ స్వగ్రామమైన టీపీగూడూరులోని కామాక్షినగర్ గిరిజనకాలనీలో నిర్వహిస్తున్న బాల సంస్కార కేంద్రం నిర్వహణకు ఆ విరాళాన్ని ఉపయోగించవలసిందిగా కోరారు. తమ గ్రామంలో గిరిజన పిల్లల బాగుకోసం చేస్తున్న ఈ సేవా కార్యక్రమంలో తాను భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి గ్రామాలలో గిరిజన బాలల విద్యాభివృద్ధి కోసం సహకరించాలని ఆయన కోరారు. తమ సంస్థ జిల్లాలో 50 గిరిజన కాలనీలలో బాల సంస్కార కేంద్రాలు నిర్వహిస్తోందని, టీపీ గూడూరులో ఉన్న ఆ కేంద్రం నిర్వ హణకు ఆయన విరాళం ఇచ్చినందుకు తమ సంస్థ తరపున వారికి, వారి కుటుంబసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలని జయభరత్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

**జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**



దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, దివ్యాంగులు అందరితో సమానంగా, గౌరవంగా జీవించేందుకు, సమాన అవకాశాలు పొందే దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. 'దివ్యాంగుల నాయకత్వాన్ని పెంచడం-వారి స్థిరమైన భవిష్యత్తు కోసం పనిచేయడం' అనే లక్ష్యంతో ఈరోజున మనం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈనెల 3న జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం కోసం అందరం కలసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకి నెలకు 6వేల రూపాయలు పింఛను అందిస్తోందని, తద్వారా జిల్లాలో 34785 మంది దివ్యాంగులను ఆదుకో వడం జరుగుతోందని తెలిపారు.

దివ్యాంగులు అందరితో సమానంగా జీవించేందుకు ప్రతిఒక్కరూ తోడ్పడాలని, దివ్యాంగులకు వైద్యఖర్చులు ఎక్కువగా ఉంటాయి కనుక, ప్రభుత్వం ఉచితంగా వారికి మెడికల్ ఇన్సురెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు.

# కలెక్టర్‌ను కలిసిన శీనయ్య



నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ (నుడా) ఛైర్మెన్‌గా ఇటీవల నియమితులైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈనెల 3న నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నుడా ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన కలెక్టర్‌కు వివరించారు.

# ఘంటసాల సంగీత విభావరి



మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 1న జరిగిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. విశ్రాంత ఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి (తెలంగాణ) పాల్గొని ఈ కార్యక్రమానికి జ్యోతి వెలిగించారు. ప్రముఖ గాయకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి సారథ్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో సీనియర్ గాయకులు ఆకుతోట రమణయ్య, సుజాత, ప్రసాద్‌బాబు, లక్ష్మి, పెంచలరెడ్డి, రామచంద్రరావు పాల్గొని ఘంటసాల మధురగీతాలను హృద్యంగా ఆలపించారు. తొలుత, ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు పిన్ను గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ తబలిస్ట్ శాంతికుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నోవా బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో విశ్రాంత ఎస్పీ మూర్తితో కలసి, నీలకంఠం 103వ సారి రక్తదానం చేశారు.

# లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు

- అందజేసిన ఎంపీ వేమిరెడ్డి



నిరుపేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఈనెల 3న నెల్లూరులోని తమ నివాసంలో ఆయన లబ్ధిదారులకు అందజేశారు. నెల్లూరు నగరానికి చెందిన చెంబేటి అనిల్‌బాబుకు లక్షా 43వేల రూపాయలు, చంద్రశేఖర్‌కి 98 వేల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చెక్కులు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఆపదలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఎంపీ వేమిరెడ్డికి లబ్ధిదారులు ఈ సందర్భంగా తమ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆకాశ దీపోద్వాసన



కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా ఈనెల 1న నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఆకాశ దీప ఉద్వాసన వేడుకగా జరిగింది. తొలుత, పోలి స్వర్గపూజ కార్యక్రమం దీపకాంతులతో అత్యంత వైభవంగా నిర్వహించారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మెన్ అళహరి విజయకుమార్, ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేదపండితుడు రామకృష్ణల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

# ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలందుకోవాలి

**- ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్**



విద్యార్థులు కష్టంగా కాకుండా, ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలందుకోవాలని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ చెప్పారు. ఈనెల 3న నెల్లూరు టౌన్‌హాలులో వినోద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలు తీర్చారు. వినోద్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్న మనపాటి చక్రవర్తిని ఆయన అభినందించారు. అనంతరం నిర్వాహకులు యండమూరిని సన్మానించారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య విజయ భాస్కర్‌రావు, ఐఆర్ఎస్ అధికారి శైలేంద్రబాబు, డాక్టర్ సుధీర్, శేఖర్ బాబు, ఫౌండేషన్ సభ్యులు రాజు, అనిల్, మున్నా, జగదీష్ పాల్గొన్నారు.

# మహిళల సమస్యల ప్రతిబింబం..'యోధ'



సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ ఇటీవల 53 మంది కవయిత్రులు రాసిన 'యోధ' పుస్తకావిష్కరణ ఈనెల 3న నెల్లూరులోని డీకెడబ్ల్యు కళాశాలలో ఘనంగా జరిగింది. మహిళలు తమ సమస్యలను ఆత్మస్థైర్యంతో అధిగమించాలని రచయిత్రులు తమ రచనల్లో పేర్కొన్నారు. మహిళల సమస్యలు, జీవితచిత్రణలతో ఈ పుస్తకం రూపొందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరి, రచయిత్రులు సుహాసిని, కరుణశ్రీ, గోవిందరాజుల సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, బండారు విజయ, మందవరపు హైమవతి, విజయలక్ష్మి, వినయ, నజ్మా పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవలో..విపిఆర్ ఫౌండేషన్

## 107 మందికి ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేసిన వేమిరెడ్డి దంపతులు




మానవీయత మూర్తీభవించిన దయార్ద్ర హృదయులు.. సేవాభూషణులు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్).. ఆయన సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తమ సహృదయాన్ని.. ఔదార్యాన్ని, దీనజనుల పట్ల తమకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 3న తమ సారథ్యంలోని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఒకేసారి 107 మంది దివ్యాంగులకు ఎంతో అవసరమైన ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేసి, అసహాయులైన నిరుపేదలు.. దివ్యాంగులకు అండగా తామున్నామంటూ భరోసా ఇచ్చారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఈ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి ఎందరో బాధితుల జీవితాలకు వెలుగుబాటలు వేశారు.

జిల్లా ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు తమవంతు సేవలందిస్తూ, వారికి అన్నివిధాలా అండదండలందిస్తున్న వేమిరెడ్డి దంపతులు ప్రత్యేకించి దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించారు. ఎన్నికలప్పుడు పలువురు దివ్యాంగులు వారిని కలిసి తమకు ఎలక్ట్రిక్ సైకిళ్ళు అందించి ఆదుకోవాలని కోరడంతో, గత ఆగస్టు 15న 40మంది దివ్యాంగులకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటిని అందజేశారు. ఈ నేపథ్యంలో, ఇంకా ఎందరో దివ్యాంగులు అలాంటి బాధలు పడుతున్నారని, వారి కోసం మరింత పెద్దఎత్తున ట్రై సైకిళ్ళను ఉచితంగా అందజేయాలని నిర్ణయించుకున్న విపిఆర్, ఆమేరకు క్షేత్రస్థాయిలో సర్వే జరిపించి ఈనెల 3న బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏకంగా 107 మందికి ట్రై సైకిళ్ళను అందజేయడంతో వారంతా వేమిరెడ్డి దంపతులకు తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

### ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి - విపిఆర్

ప్రజల సేవకోసమే తాము రాజకీయాల్లోకి వచ్చామని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఎంపీ విపిఆర్ ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు. జిల్లాలో తాగునీటి కోసం తంటాలు పడుతున్న ప్రాంతాల్లోని ప్రజలకు తమ ఫౌండేషన్ తరపున పరిశుభ్ర జలాలను అందించాలని నిర్ణయించుకుని, 2017లో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు చేయడం ప్రారంభించామని, అనేక గ్రామాల్లో ఆ ప్లాంట్లను నెలకొల్పామని ఆయన చెప్పారు. భవిష్యత్తులోనూ ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. వైకల్యంతో బాధలు పడుతున్న దివ్యాంగులకు ఇలా సాయపడడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఉదయగిరి ప్రాంతంలోని దివ్యాంగులకు కూడా ట్రై సైకిళ్ళను త్వరలోనే అందజేస్తామని చెప్పారు.

### పేదల సేవే ధ్యేయం - ప్రశాంతిరెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, పేదలకు-అసహాయులకు సేవలందించేందుకే విపిఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. తమ ఫౌండేషన్ రాజకీయాలకు అతీతంగా ఉన్న ప్రజాసేవా సంస్థ అని చెప్పారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 107 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ పంపిణి చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోవూరు నియోజకవర్గంలో గత ఇరవై ఏళ్లుగా పూడికలు తీయని సాగునీటి కాలువలలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూడిక తీసే పనులు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే నెలలో యువత కోసం పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహించి వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆమె ప్రకటించారు. దివ్యాంగుల పెన్షన్ 3 వేల నుంచి రూ. 6 వేలకు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవలు వెలకట్టలేవని ప్రశంసించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నాయకులు ఎంవి శేషయ్య, అడపాల అనీష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ పాల్గొన్నారు.



## సాహిత్యాభిలాషి.. సమాజ సేవాభిలాషి

# వరప్రసాద్‌రెడ్డికి విశిష్ట పురస్కారం

- తెలుగు విశ్వవిద్యాలయంలో ఘన సత్కారం
- వర్సిటీకి కోటి రూపాయలిచ్చిన మన నెల్లూరు బిడ్డ

సాహిత్యాభిలాషి, సమాజ సేవాభిలాషి, అసమాన ప్రతిభాపాటవాలతో అటు వైద్యరంగంలోనూ, ఇటు సారస్వత సీమలోనూ తనదంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న మహోన్నత సేవాశిఖరం..శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు..పద్మభూషణ్ డా.కేఐ వరప్రసాద్‌రెడ్డికి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట పురస్కారం లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా, డిసెంబరు 2న మేడ్చల్ జిల్లా బాచుపల్లి నూతన క్యాంపస్‌లో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సమాజానికి స్ఫూర్తిదాయకమైన సేవలందిస్తున్నవారికి బహుకరించే ఆ విశిష్ట పురస్కారాన్ని 2023వ సంవత్సరానికి మన నెల్లూరీయులైన వరప్రసాద్‌రెడ్డి అందుకోవడం నెల్లూరు సీమకే కాదు, రాష్ట్రానికే గర్వకారణం. తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చేతులమీదుగా ఆయన ఆ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పురస్కారం కింద తెలుగు యూనివర్శిటీవారు డా. వరప్రసాద్‌రెడ్డికి లక్ష రూపాయల చెక్కును కూడా బహుకరించారు. అయితే, తనకు అందజేసిన ఆ లక్ష రూపాయలతో పాటు, మరో కోటి రూపాయలను కూడా విశ్వవిద్యాలయానికి విరాళంగా అందించి డా.వరప్రసాద్‌రెడ్డి తెలుగు భాషపై తనకున్న చాటుకున్నారు. ఆ కార్యక్రమానికి వచ్చినవారంతా వరప్రసాద్‌రెడ్డి భాషాభిమానాన్ని, దాతృత్వాన్ని కొనియాడుతూ, కరతాళధ్వనులతో ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, ఉన్నత విద్యామండలి అభ్యక్షుడు ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి, రిజస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, మేడ్చల్ కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ రాధిక, మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ సాబేర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

### వారి సేవలు స్ఫూర్తిదాయకం - మంత్రి శ్రీధర్‌బాబు

పద్మభూషణ్ డా.వరప్రసాద్‌రెడ్డి సమాజానికి స్ఫూర్తిదాయకమైన సేవలందిస్తున్న మంచివ్యక్తి అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. 'ఆయనొక వ్యక్తి కాదు.. వైద్యరంగంలో అసమాన కీర్తిని పొందిన శక్తి' అంటూ వరప్రసాద్‌రెడ్డిని మంత్రి కొనియాడారు.

### మన భాష..మన సంస్కృతే మనకు బలం - వరప్రసాద్‌రెడ్డి

'మన భాష.. మన సంస్కృతే మనకు బలం' అని ఈ సందర్భంగా డా. వరప్రసాద్‌రెడ్డి చెప్పారు. కవలపిల్లల్లాంటి మన భాషా సంస్కృతులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భాష-సంస్కృతులే తెలుగువారి అస్తిత్వమని, వాటిని పరిరక్షించుకోవడానికి..పరిఢవిల్లజేయడానికి తెలుగు విశ్వవిద్యాలయం అవసరమని, దానికి ప్రభుత్వ సహకారం కీలకమని అన్నారు. అనంతరం, తనకిచ్చిన లక్ష రూపాయలను కూడా విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కోసం ఆయన తన విరాళంగా అందజేశారు.

# శ్రీసిటీ ప్రగతి భేష్

- బెలారస్ బృందం ప్రశంస



బెలారస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బెల్‌సిసిఐ) ప్రతినిధుల బృందం ఈనెల 3న శ్రీసిటీని సందర్శించింది. డయానా తురవా నేతృత్వంలో 14మంది ప్రతినిధులు ఈ సందర్శనకు వచ్చి, శ్రీసిటీ ప్రగతిని ప్రశంసించారు. శ్రీసీటీలోని పారిశ్రామిక అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకుని, అత్యాధునిక మౌళిక సదుపాయాలు, వైవిధ్యభరిత పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలను స్వయంగా చూశారు. వైటల్ పేపర్స్ పరిశ్రమను సందర్శించి, కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. తొలుత, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్మెంట్) శ్రీసిటీ ప్రగతిని వివరించారు. బెలారస్ బృందం శ్రీసిటీ పర్యటన పట్ల శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. భారత్, బెలారస్ దేశాల మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా తన ప్రకటనలో పేర్కొన్నారు. బెలారస్ వ్యాపారవేత్తలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది దోహదపడుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.




## డీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# చిన్నారులకు నూతన వస్త్రాలు

దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్(డీఎస్సార్ ట్రస్టు) ఆధ్వర్యంలో ఇటీవల నార్త్ ఆములూరు, గొల్లపాళెంలోని చైల్డ్ ఆశ్రమంలోని 300మంది చిన్నారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ట్రస్ట్ ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి తండ్రి సుబ్బరామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ వితరణ చేశారు. చైల్డ్ ఆశ్రమం వ్యవస్థాపక కార్యదర్శి రామచంద్ర శరత్‌బాబు మాట్లాడుతూ, దేవిరెడ్డి సోదరులు సుధాకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు తమ ఆశ్రమానికి చేస్తున్న సాయానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి దశరథరామిరెడ్డితో పాటు, భాస్కర్‌రెడ్డి, పుచ్చలపల్లి సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సీఇఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ట్రస్టు స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, గాదంశెట్టి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ నూతన వస్త్రాలు బహుకరించారు.





# జానకిరామ.. రామాయణం 42

- ఊటుకూరు జానకి రామారావు



అది కుయ్యోమొర్రో అంటూ ఏడుస్తుంటే దాని వెంట వస్తున్న తక్కిన దాసీజనమంతా శరణువేడటానికి కౌసల్యాదేవి మందిరం వైపు పరుగెత్తారు.

శత్రుఘ్నుడు తీవ్రమైన క్రోధావేశంతో కైకేయిని కూడా దూషిస్తూ ఉంటే ఆమె విపరీతమైన భయంతో భరతుడిని శరణువేడింది.

అప్పుడు శత్రుఘ్నుని చూసి భరతుడు.. తమ్ముడూ స్త్రీలను చంపడం మహాపాపం. వీరిని వదిలివేయి, అదీగాక వీరికి ఏవిధమైన హానికలిగినా జీవితాంతం రాముడు మనతో మాట్లాడడు.

"రాముడు నిందిస్తాడు" అనే భావనే నాకు లేకపోతే ఈ ధూర్తురాండ్రను నేనే ఎప్పుడో సంహరించి ఉండేవాడిని.

భరతుడి మాటలు విని వారిరువురినీ విడిచిపెట్టేశాడు శత్రుఘ్నుడు.

భరతుడు తండ్రికి చేయవలసిన పితృకార్యాన్ని పూర్తిచేశాడు. అది పదునాల్గవరోజు దశరథుడి చితికి నిప్పంటించి!!.

రాజ్యాభిషేక మహోత్సవం జరిపించే అధికారంగల మంత్రులంతా భరతుని సందర్శించారు.

ఆయన సముఖంలో నిలిచి నీ తండ్రి మరియు నీ అన్నగారు ఇరువురూ రాజ్యం నీకు ఇచ్చివేశారు. ఇక నీవు రాజ్యలక్ష్మిని చేపట్టవలసి ఉంది, అందుకు ఏ మాత్రం ఆలస్యమైనా రాజ్యంలో అరాచకం ప్రబలవచ్చు. ఇప్పటివరకూ ప్రజలు శాంతితో సహజీవనం చేస్తున్నారు. ఎవరూ ఎవరినీ పీడించడంలేదు. ఇప్పటివరకు ఏ ఉపద్రవం లేదు.

నీ పట్టాభిషేకానికి సర్వం సిద్ధం చేశామని పలికి నిలిచారు వారంతా!

భరతుడు సగౌరవంగా వారందరికి నమస్కరించి వారు అప్పటికే తెచ్చి అక్కడ ఉంచిన అభిషేక సామాగ్రికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి... అమాత్యులతో ఇలా అన్నాడు...

మా వంశంలో ఎల్లప్పుడూ పెద్దకుమారుడే రాజు! అది ఉచితం.. అదే మా వంశాచారం. మీరీవిధంగా మాట్లాడవద్దు.

మా రాముడే రాజు, ఆయన బదులుగా పదునాల్గు సంవత్సరాలు నేను అరణ్యవాసం చేస్తాను.

చతురంగబలాలు సిద్ధం చేయండి, మహాసైన్యాన్ని సమకూర్చండి. నేను, నా జ్యేష్ఠసోదరుడైన రాముని అరణ్యం నుండి తీసుకు వస్తాను, మనం ఆయననే రాజుగా అభిషేకించాలి!

మనం రామునివద్దకు వెంటనే ప్రయాణం కావలి. మార్గాలు నిష్కంటకాలు గావించండి, చక్కని రహదారులు గంగాతీరం వరకు ఏర్పాటు చేయించండి, దిగుడుబావులు తవ్వించండి... అని ఆజ్ఞాపించాడు భరతుడు.

అమాత్యులంతా క్షణంలో ఆ పనులన్నీ పూర్తిచేసి ఆయనకు తెలిపారు.

ఆయాప్రాంతాలు, ప్రదేశాల స్వరూప, స్వభావాలు తెలిసిన వారు, సూత్రాలు పట్టి కొలతలు వేసేవారు, నేలను తవ్వేవారు, యంత్రాలుపయోగించేవారు, శిల్పులు, వడ్రంగులు, కూలివారు, చెట్లునరికి మార్గం ఏర్పరచేవారు, బాటవేసేవారు, వేసిన బాట మీద సున్నం పరచి పటిష్టం చేసేవారు, చేయువారు, వెదురు పనివారు, సమర్థులైన పర్యవేక్షకులు... అందరూ ముందుగా బయలుదేరి వెళ్ళారు.

వారితోపాటు అపారజనసమూహం బయలుదేరింది.

బాటలన్నీ పౌర్ణమినాడు ఉప్పొంగిన సముద్రాలలా ఉన్నాయి.

భరతుడి ఉదాత్తమైన ఈ పలుకులకు జనులందరి కనుల నుండి ఆనందభాష్పాలు జలజలరాలాయి.

మనమంతా రాముని వెనక్కి తీసుకునే రావాలి!

అదే మన ధ్యేయం, అదే మన కర్తవ్యం అన్నట్లుగా అందరు దీక్షపూని సాగుతున్నారు. ఆ రాత్రి గడచి తెల్లవారుతుండగా మంగళవాయిద్యాలతో కూడిన స్తోత్రాలతో భరతుని స్తుతించ సాగారు వందిమాగధులు, బంగారు దండాలతో కొట్టి యామ దుందుభి మ్రోగించసాగారు.

భరతుడు నిదురలేచాడు.

ఆ స్తోత్రపాఠాలు, ఆ దుందుభిస్వనాలు ఆయన హృదయంలో తీవ్రమైన వేదన రగిలించాయి.

వెంటనే అందరినీ వాటిని ఆపమన్నాడు, "నేను రాజును కాను" అని వారికి చెప్పి అన్నింటినీ ఆపివేశాడు.

ప్రక్కనేవున్న శత్రుఘ్నునితో చూడు కైక వలన ఎంత అపకారం జరిగిందో.. ఆ మహారాజు దుఃఖాలన్నీ నాకు వదిలి వెళ్ళిపోయాడు.

మన అందరికీ రక్షకుడైన రాముడిని ధర్మహీనురాలైన నా తల్లి స్వయంగా అడవికి పంపింది. రాజ్యం చుక్కాని లేని నావ అయ్యింది.... శ్రీ రాముని మరల అయోధ్యకు రప్పించి పట్టాభిషిక్తుడిని చేయటమే! అని మనసులో దృఢపరచుకొన్న భరతునికి... వశిష్ఠుల వారు రాజసభలో ఉన్నారు, మిమ్మల్ని రమ్మన్నారు అనే కబురు వచ్చింది.

రాజసభాప్రాంగణంలో సకల సంభారాలతో సిద్ధంగా ఉన్నారు మహర్షి! భరతుని చూడగనే "నాయనా! నీతండ్రీ, అన్నగారు ఇచ్చిన ఈ రాజ్యాన్ని స్వీకరించి, ధర్మబద్ధంగా పరిపాలన సాగించు" అని పలికి భరతుడి ఆమోదం కోసం ఎదురు చూశారు.

ఆ మాట వినగానే భరతుడు కనుల నీరునింపుకొని దోసిలి ఒగ్గి "మహాత్మా రాముని రాజ్యమిది! ఇక్ష్వాకులలో ధర్మం తప్పి నడిచినవారు ఎవరైనా ఉన్నారా! ధర్మాత్ముడైన దశరథుడికి పుట్టినవాడు చేయవలసిన పనేనా ఇది! దశరథుడి కొడుకు ఇంకొకరి సొత్తును అపహరిస్తాడా?

నేను, ఈ రాజ్యం రాముడి సొత్తు!

మాలో పెద్దవాడు, దిలీప, నహుషులతో సమానుడూ అయిన రామునకే ఈ రాజ్యంపై అధికారం, వేరెవ్వరికీలేదు!.

నా తల్లి చేసిన పాపకార్యం నేనెన్నటికీ అంగీకరించను.

రాముడిని అనుసరించటమే నాకు తెలిసినది.

ఏ కారణం చేతనైనా అన్నగారిని తీసుకొని రానట్లైతే నేను కూడా లక్ష్మణునిలా అడవిలో ఉండిపోతాను.

మార్గాలు ఏర్పరచేవారు, రక్షించేవారు, తదితరులంతా నాచేత ముందుగానే పంపబడ్డారు.

అని పలికి సుమంత్రునివైపు తిరిగి, వెంటనే రాముని వద్దకు బయలుదేరడానికి కావలసిన ఏర్పాట్లు చేయమని, సైన్యంతో సహా సిద్ధం కావాలని ఆదేశించాడు.

భరతుడి ఆజ్ఞ విని సుమంత్రుడు ఉత్తమాశ్వాలు పూన్చిన రథం సిద్ధం చేసి ఉంచాడు.

పిమ్మట ప్రాతఃకాలమందే లేచి శ్రేష్ఠమైన రథమెక్కి బయలు దేరాడు భరతుడు. ఆయన వెంట అయోధ్యలోని అధికార గణమంతా బయలుదేరింది. చతురంగబలాలు కదిలాయి. అయోధ్య అంతా కదిలింది.

అందరి మనసులో ఒకటే లక్ష్యం రాముడిని త్వరగా చూడాలని. మనసుతో సమానంగా పరిగెత్తాలని కోరిక!.

అలా ప్రయాణం చేస్తూ గంగ ఒడ్డుకు చేరుకున్నారంతా!.

ఇంత సైన్యం గంగ ఒడ్డుకు ఎందుకు వచ్చింది? కారణమేమై ఉంటుంది? అనుమానం వచ్చింది గుహుడికి.

ఆ రథం మీద కనపడే ధ్వజాన్ని బట్టి చూస్తే ఇది భరతుడి సేనావాహిని అని తేటతెల్లమవుతుంది.

భరతుడు ఇప్పుడెందుకు వచ్చాడు? ఇక్కడున్న పల్లెలోని జనులను బంధించటానికి రాలేదుకదా! మనలను చంపటానికి కాదుకదా! లేక రాజ్యాన్ని పూర్తిగా నిష్కంటకం చేసుకోవాలనే ఉద్దేశంతో రాముని చంపివేయటానికి కాదుకదా!

రాముడు నాకు ప్రభువే కాదు, నాకు మిత్రుడు కూడా ఆయన ప్రయోజనం కాపాడటానికి అందరూ సన్నద్ధం కండి అని సేనను ఆజ్ఞాపించాడు.

ఐదువందల నావలలో ఒక్కొక్క దానిపై నూర్గురు యోధులు కవచధారులై సిద్ధంగా ఉండండి! అని ఆదేశాలు ఇచ్చాడు.

"రాముడి విషయంలో భరతుడికి ఏ విధమైన దుష్టబుద్ధి లేదని తెలిన తరువాతనే అతని సేన గంగను సుఖంగా దాట గలుగుతుంది" అని పలికి అందరినీ సిద్ధంచేసి తాను మాత్రం భరతుడికి మత్స్యమాంసములు, తేనె పట్టుకొని వినయంగా ఎదురు వెళ్ళాడు.

సుమంత్రుడు ఆతనిని చూపి భరతునితో ఈయన పేరు గుహుడు. నీ అన్నకు ప్రాణస్నేహితుడు. ఆయనను నీవుకలిసి మాట్లాడితే రాముని ఆచూకీ మనకు తెలుస్తుంది అని చెప్పాడు.

అప్పుడు భరతుడు శీఘ్రంగా గుహుని తనవద్దకు తీసుకు రమ్మన్నాడు.

గుహుడు వినయంగా భరతుడితో మేమంతా నీకు లొంగి ఉండేవారం. ఇది నీ దాసుని గృహం. దీనిలో నీ ఇచ్ఛానుసారం నివసించు అని కోరాడు.

..(సశేషం)

# ముచ్చటగా ముగ్గురు!

## చర్చనీయాంశంగా మారిన మోహన్ భగవత్ సూచన

దేశంలో జనాభా రేటుపై ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మన దేశ జనాభాలో పెరుగుదల రేటు తగ్గుముఖం పట్టడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ మొత్తం సంతాన సాఫల్యతా రేటు 'టీఎఫ్ఆర్-టోటల్ ఫెర్టిలిటీ రేట్) మూడుగా ఉండాలన్నారు. "జనాభా తగ్గుదల తీవ్ర ఆందోళనకరం. టీఎఫ్ఆర్ 2.1 కన్నా తక్కువగా ఉన్న సమాజం ఈ భూమిపై నుంచి అంతర్ధానం అవుతుందని జనాభా శాస్త్రం స్పష్టం చేస్తోంది. అంతర్ధానానికి బయటనుంచి వచ్చే ముప్పులు అవసరం లేదు. టీఎఫ్ఆర్ తగ్గితే సమాజం దానంతటదే కనుమరుగవుతుంది. ఈ రకంగానే చాలా భాషలు, సమాజాలు అంతమయిపోయాయి." అని చెప్పారు. "కుటుంబం అనేది సమాజంలో ఒక ముఖ్యమైన అంతర్భాగం. సమాజ నిర్మాణంలో ప్రతి కుటుంబం ముఖ్యమైన భాగంగా ఉంటుంది. మన దేశ జనాభా విధానాన్ని 1998లోనో, 2002లోనో రూపొందించారు. టీఎఫ్ఆర్ 2.1 కన్నా తక్కువగా ఉండకూడదని ఆ విధానం చెబుతోంది. 2.1 రేటు చాలదు. కనీసం టీఎఫ్ఆర్ 3గా ఉండాలి." అని స్పష్టం చేశారు. ఒక మాటలో చెప్పాలంటే దేశంలో పెళ్లైన ప్రతి కొత్త జంటా ముగ్గురు పిల్లల్ని కనాలి అని మోహన్ భగవత్ సూచిస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను భాజపా, దాని మిత్రపక్షాలు సమర్థించగా విపక్షాలు విమర్శించాయి.

పిల్లలను పెంచడం వెనక సాధకబాధకాలు మోహన్ భగవత్‌కు తెలుసా అని కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం పెరుగుతున్నాయని చెబుతూ "ప్రాథమిక అవసరాలు తీర్చే పరిస్థితి లేనప్పుడు ఎక్కువమంది పిల్లలు ఎందుకు?" అని ప్రశ్నించారు. "ముస్లింలు ఎక్కువ మంది పిల్లల్ని కంటున్నారని ప్రధాని మోదీ విమర్శించారు. ఇప్పుడు మోహన్ భగవత్ ఎక్కువ మంది పిల్లల్ని కనమంటున్నారు. ఎక్కువ మంది పిల్లలున్న వారికి ఆయన డబ్బులిస్తారా?" అని ప్రశ్నించారు. భాజపా, ఆర్ఎస్ఎస్ నేతలు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని, భాజపా నేతలు జనాభా నియంత్రణ అవసరమని చెబుతుండగా మోహన్ భగవత్ మాత్రం జనాభా పెరగాలని అంటున్నారని కాంగ్రెస్ ఎంపీ తారిక్ అన్వర్ విమర్శించారు. ఇప్పటికే దేశ జనాభా దాదాపు 150కోట్లకు చేరిందని, ఇంకా ఎంత జనాభా కావాలని శివసేన నేత సంజయ్ రౌత్ ప్రశ్నించారు.

వాస్తవానికి జనాభా సంఖ్య, జననాల రేటుపై నాయకుల వ్యాఖ్యల్లో చాలా అంతరార్థాలున్నాయి. ముస్లింల జననాలరేటు ఎక్కువగా ఉందని, హిందువుల జననాల రేటు తక్కువగా ఉందనేది భాజపా నేతల వైఖరి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ విషయంలో బహిరంగంగానే తన వైఖరిని స్పష్టం చేశారు. సమాజంలో ఏ ఒక్క వర్గంలోనో జనాభా పెరగకుండా చూడాలని, మతపరంగా జనాభా సంఖ్యలో మార్పు రాకూడదని గతంలో అన్నారు. ఇక దక్షిణాది రాష్ట్రాలు జనాభా రేటును పన్నుల పంపిణీ కోణంలో చూస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉత్పాదకత కోణంలో ఈ అంశాన్ని చూస్తున్నారు. దేశంలో వృద్ధుల జనాభా కన్నా యువ జనాభా తక్కువగా ఉండడం సమాజానికి మంచిది కాదని, శ్రమ చేసే జనాభా సంఖ్య ఎక్కువగా ఉండాలని ఆయన ఇటీవల కాలంలో చెబుతున్న సంగతి తెలిసిందే. రెండు లేదా అంతకన్నా ఎక్కువ మంది సంతానం ఉన్న వారే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అర్హుల్ని చేసేలా చట్టం తీసుకురావాలని యోచిస్తున్నట్లు కూడా చంద్రబాబు చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా జననాల రేటు పెరగాలని అన్నారు.

కేంద్ర పన్నుల రాబడిని రాష్ట్రాల మధ్య పంచే విషయంలో తీవ్ర అసమానతలున్నాయని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటి నుంచో గగ్గోలు పెడుతున్నాయి. జనాభా నియంత్రణ పాటించే రాష్ట్రాలకు కేంద్రం ప్రోత్సాహకాలు ఇస్తుంది. అదే సమయంలో కేంద్ర పన్నుల రాబడిని రాష్ట్రాల మధ్య పంచడానికి తలసరి ఆదాయాన్ని ఒక ప్రామాణికంగా తీసుకుంటోంది. తలసరి ఆదాయం తక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువగా వాటా వెళ్తోంది. ఫలితంగా జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు పన్నుల వాటా ఎక్కువగానూ, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు తక్కువగానూ పంపిణీ అవుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణపై పునరాలోచిస్తున్నాయి.

మొత్తం మీద దేశంలో జననాల రేటుపై మోహన్ భగవత్ చేసిన సూచన తీవ్ర చర్చకు తెర లేపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఖచ్చితంగా మౌనం వీడాల్సిందే. దేశ జనాభా విషయంలో స్పష్టంగా ఒక విధానాన్ని ప్రకటించాల్సిందే. బహుశా త్వరలోనే కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం దేశ జనాభా విషయంలో ఒక విధానాన్ని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి కూడా. మోహన్ భగవత్ వ్యాఖ్యలు దానికి ముందస్తు సూచిక కావచ్చు కూడా. దేశ జనాభా విధానమన్నది సమగ్రంగా ఉండాలి. కేవలం సంఖ్యకు, రేటుకు మాత్రమే అది పరిమితం కారాదు. ఎందుకంటే రాను రానూ ప్రకృతి వనరుల్లో క్షీణత పెరుగుతోంది. ఆర్థికాభివృద్ధి పేరుతో కొనుగోళ్ళ తత్వాన్ని మితిమీరి ప్రోత్సహించే అవాంఛిత పరిస్థితులు ఇప్పుడున్నాయి. ప్రకృతి వనరులను పొదుపుగా వాడుకుంటూ, రాబోయే తరాలకు ఏ మాత్రం లోటు లేని విధంగా వాటిని పరిరక్షించే విధంగా మన విధానా లుండాలి. జనాభా విధానం కూడా దానికి అనుగుణంగానే ఉండాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# రామ్‌కుమార్‌రెడ్డిని కలిసిన వైకాపా నాయకులు



వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఇటీవల వాకాడు, కోట మండలాలకు చెందిన వైయస్సార్సీపి నాయకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షా లతో ప్రజల ఇబ్బందులు, స్థానిక సమస్యలు, తాజా రాజకీయ పరిణామాల గురించి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, వాకాటి రవి, పెంచల్‌రెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు రెవిన్యూ అధికారుల తోడ్పాటు

తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ రవీంద్రపురంలో తుఫాన్ బాధితులైన 50 గిరిజన కుటుంబాల వారికి తహశీల్దార్ టీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు ఈనెల 1న బియ్యం, నూనె తదితర నిత్యావసర సరుకులందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నిరుపేద గిరిజనులకు వారు తమ తోడ్పాటునందించారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

రాష్ట్రంలో సాగునీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. ఈనెల 5న ఈ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉండగా, ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో భారీ వానలు కురుస్తుండడంతో పలు జిల్లాల్లో పరిస్థితులు ఎన్నికలకు సానుకూలంగా లేనందువల్ల ప్రస్తుతానికి ఈ ఎన్నికలు వాయిదా వేశారు. మళ్ళీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాలో ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని సమాచారం.

## జూ. అటవీ అధికారుల..


# కొత్త కార్యవర్గం

ఏపీ జూనియర్ అటవీ అధికారుల సంఘం జిల్లా శాఖ సమావేశం ఈనెల 1న నెల్లూరులో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరు డీఆర్‌ఓ కె.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆమంచర్ల సెక్షన్ అధికారి ఎం.శ్రీని వాసులు ఎన్నికయ్యారు. అదేవిధంగా, ఉపాధ్యక్షుడిగా సైదాపురం ఎఫ్‌బీఓ పి.రవి శేఖర్, నిర్వహణ కార్యదర్శిగా కావలి సెక్షన్ అధికారి ఆర్.సుమన్, సంయుక్త కార్యదర్శిగా సూళ్లూరుపేట ఎఫ్‌బీఓ సలీం లను ఎన్నుకున్నారు గుంటూరు రేంజ్ డెప్యూటి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అనం తరం కొత్త కార్యవర్గం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు.

# పెన్నమ్మ గలగలలు

ఫెయింజల్ తుఫాను ప్రభావంతో గత మూడునాలుగు రోజులుగా కురుస్తున్న భారీవానలతో నెల్లూరులోని పెన్నమ్మ గలగలా పారుతోంది. నెల్లూరు చెరువు కూడా నిండిపోయి జల కళ సంతరించు కుని ఆహ్లాదంగా కనిపిస్తోంది. నిత్యం అనేకమంది స్థానికులు, పర్యాటకులు పెన్నానది గట్టుకు, చెరువు గట్టుకు వెళ్ళి ఆ సుందర దృశ్యాలను చూసి ఆనం దిస్తున్నారు.

# 'అంతరంగ వీక్షణం' పరిచయ వేదిక




'సమాజం మీద సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై కవితల పోటీని నిర్వహిస్తూ, కవిసమ్మేళనానికి వేదికగా అనుసంధానిస్తూ చిన్ని నారాయణరావు ఫౌండేషన్ డిసెంబర్ 8, ఆదివారం ఉదయం నెల్లూరు టౌన్‌హాల్ (ఏసీ హాలు)లో ఉదయం 10 గంటలకు ఓ పుస్తక పరిచయ కార్యక్రమం తలపెట్టింది. ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్‌రావు సాహితీవేత్తలతో ముఖాముఖిల సంకలనం 'అంతరంగ వీక్షణం' పరిచయ సభ జరగ నుంది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకుల పతి ఆచార్య యస్.విజయభాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సభకు ప్రముఖ కవి, విమర్శకులు చిన్ని నారాయణరావు అధ్యక్షత వహిస్తారు. బహుజనతత్వవేత్త, సాహితీ విమర్శకులు, కవి లక్ష్మీనరసయ్య కీలకోపన్యాసం చేస్తారు. విశిష్ట అతిథులుగా నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, ఈతకోట సుబ్బారావు, గోవిందరాజు సుభద్రా దేవి, కొమ్మవరపు విల్సన్‌రావులు పాల్గొంటారు. పెద్దసంఖ్యలో కవులు పాల్గొని సభను జయప్రదం చేయాలని నిర్వాహకులు చిన్ని నారాయణరావు కోరారు. పాల్గొనే ప్రతి కవి సత్కారం అందుకొనే కార్యక్రమాన్ని చిన్ని నారాయణరావు ఫౌండేషన్ చేట్టిందని చెప్పారు.

# 'తెలుసుకో సీమ చరిత' పుస్తకావిష్కరణ



ప్రవాస భారతీయుడు పెను పుట్టా రచించిన 'తెలుసుకో సీమ చరిత' పద్య శతకాన్ని ఈనెల 1న నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాలులో ఆవిష్కరించారు. స్థానిక పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్ర ప్రసాద్, ప్రముఖ కవులు చీమకుర్తి వెంకటేశ్వరరావు, బత్తిన సాయికుమార్‌రెడ్డి, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధరబాబు, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితను సన్మానించారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అండర్‌బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



గూడూరు పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రతిరోజూ ఏదో సమయంలో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, డిఎస్పీ వివి రమణకుమార్, పురపాలక సంఘ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు కలిసి అండర్‌బ్రిడ్జి వద్ద పరిశీలిం చారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్థంభించడంతో వాహనచోదకులు, ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గం చూడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఒకటవ అండర్‌బ్రిడ్జి నుండి భారీ వాహన రాకపోకలు జరిగేలా చూడాలన్నారు. రెండో అండర్‌బ్రిడ్జి గుండా భారీ వహనాలను అనుమతించవద్దని, అప్పుడే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బస్సులు, వ్యాన్లకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సూచించారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్, రహీం, వెంకటేష్ పాల్గొన్నారు.

# జోరువానలో పెన్షన్ల పంపిణీ

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గెలిచిన వెంటనే పెన్షన్లను పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఇటీవల తెలుగుదేశం నాయకులతో కలిసి ఆయన పింఛన్లను అందించారు. వర్షంలో తడుస్తూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదును పంపిణీ చేశారు. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఇంకా పెన్షన్లకు అర్హులైవరైనా ఉంటే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టౌన్ సి.ఐ శేఖర్‌బాబు, నాయకులు బిల్లు చెంచురామయ్య, బాషా, రహీం, ఇజ్రాయిల్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# సైదాపురంలో పారిశుధ్య కార్యక్రమం



మండల కేంద్రమైన సైదాపురంలో ఈనెల 3న పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాలకు కొన్ని చోట్ల నీరు నిల్వవుండి దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయని, వాటి వల్ల అనా రోగ్య సమస్యలు తలెత్తకుండా ఈ పారిశుద్ధ్య కార్యక్రమం చేపడుతున్నామని సైదాపురం పంచాయతీ సర్పంచ్ ఏందోటి శారద తెలిపారు. పారిశుద్ధ్య లోపాలున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ వేస్తూ పరిసరాలను శుభ్రపరచడం జరిగిందని తెలిపారు.

# వికలాంగుల దినోత్సవం



గూడూరు పట్టణంలో డివిఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగు లకు సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి దాతృత్వంతో ఫలసరుకులు, దుప్పట్లను క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, సీనియర్ రొటేరియన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు చేతులమీదుగా అంద జేశారు. కార్యదర్శి చోళవరం గిరిబాబు, బండి ధనుంజయరెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డి, హరినాథ్‌రెడ్డి, నాగరాజారెడ్డి, సనత్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కోట కృష్ణ, కృష్ణంరాజు పాల్గొన్నారు.



# సీఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని

ఈ నెల 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్క రించుకొని గూడూరు ప్రగతి సేవా సంస్థ, ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సంయుక్తంగా సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని కార్యక్రమంలో భాగంగా సిఆర్‌రెడ్డి ఆసుపత్రిలో 30మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షు రాలు డాక్టర్ తనుజ, సెక్రెటరీ అనిత, మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, సభ్యులు శశికళ, ప్రగతి సేవా సంస్థ సెక్రెటరీ జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తిప్పవరప్పాడు జంక్షన్లో వాహన తనిఖీలు



నిబంధనలు పాటించని వాహన దారులపై కఠిన చర్యలు తప్పవని గూడూరు రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బి.శాంతి అన్నారు. గూడూరు మండలం తిప్పవరప్పాడు జంక్షన్‌లో ఇటీవల ఆమె సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సిబ్బంది కరీముల్లా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఔను.. వాళ్లిద్దరూ కష్టపడ్డారు!

(మొదటిపేజీ తరువాయి)



కూడా తమతో కలుపుకున్నారు. ఆ ఎన్నికలలో ఘన విజయం సాధించారు.

రాజశేఖరరెడ్డి వారసుడిగా రాజకీయాలలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి చూపించిన రాజకీయ చాణుక్యతని ప్రదర్శించలేకపోయారు. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఒంటరి పోరాటం చేసి 2024 ఎన్నికలలో చతికిలబడ్డారు.

చంద్రబాబుకి సైతం ఒంటరిగా పోటీ చేసిన ప్రతిసారీ ఓటమే ఎదురయ్యింది. ఆయన 1999లోనూ, 2014లోనూ బీజేపీతో కలిసే విజయం సాధించారు. 2019లో ఒంటరిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు.

ఇలా పొత్తులతో ఏకమై ఎత్తులతో ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్న తరుణంలో పార్టీలు విజయం సాధిస్తున్నాయి. ముఖ్యంగా అధికారపార్టీ వ్యతిరేక ఓటు చీలనీయకుండా ఉండడానికి ఈ వ్యూహాలు పనికొస్తున్నాయి. ఒక్కోసారి పొత్తుల వల్ల అధికారపార్టీకి కూడా లాభం కలుగుతోంది. అదే సమయంలో అటు కర్ణాటకలోనూ ఇటు తెలంగాణలోనూ కాంగ్రెస్ నేతలు తమ ముఠా తగాదాలని పక్కనపెట్టి ఏకతాటిపై నడిచినందువల్లే ఆయా రాష్ట్రాలలో అధికారాన్ని తమ కైవసం చేసుకోగలిగాయి.

## మహారాష్ట్రలో...

మొన్నటి పార్లమెంటు ఎన్నికలలో ఎదురైన చేదు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మహారాష్ట్ర ఎన్నికలలో శివసేన సారథి ఏక్‌నాథ్ షిండే వ్యూహాత్మకంగా వ్యవహరించారు. హిందుత్వ ఓటుని చీలిపోనీయకుండా భాజపాతో జతకట్టారు. అనూహ్యంగా ఈ ఎన్నికలలో దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ 132 సీట్లు సాధించగా, ఏక్‌నాథ్ షిండే ఆధ్వర్యంలోని శివసేన 57 సీట్లు కైవసం చేసుకుంది. అలాగే, అజిత్‌పవార్ సారధ్యం వహిస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ 41సీట్లు గెలుచుకుంది. ఈ క్రమంలో గురువారం మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులుగా ఏకనాథ్ షిండే, అజిత్‌పవార్‌లు ప్రమాణం చేశారు. ముగ్గురూ కలిసి కష్టపడ్డారు కాబట్టి ఒకరు ముఖ్యమంత్రిగా, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టి పాలనకి శ్రీకారం చుట్టారు.

## కర్ణాటకలో...

కర్ణాటక రాజకీయాలు నిలకడగా ఉండవు. ఆ రాష్ట్రంలో ఎన్నికైన పార్టీ ఏదైనా ఎక్కువ కాలం అధికారంలో ఉండదు. కారణం అక్కడ ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం ఎక్కువ. ఈ క్రమంలో కాంగ్రెస్ – బీజేపీ పార్టీలు ఎవరితో కలుస్తాయన్న దానిపైన అక్కడ గెలుపోటములు ఆధారపడి ఉంటాయి. ఒక్కోసారి ఆ రెండు పార్టీలు కూడా కావలసినన్ని సీట్లు సాధించినా ఆయా పార్టీలలో ఉన్న కుమ్ములాటల వల్ల ప్రభుత్వాలు సుస్థిరంగా ఉండవు. ఈ కారణంతోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం ఇప్పటికీ అష్టకష్టాలు అనుభవిస్తోంది. పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా నగరం విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో కర్ణాటక ప్రభుత్వం వెనుకబడిపోయింది. గత ఏడాది జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఒంటరిగానే తనకి కావలసినన్ని సీట్లు సాధించుకుంది. మొత్తం 224 సీట్లకి గాను 135 సీట్లు ఆ పార్టీ సాధించుకోగలిగింది. అక్కడ ఈసారి డీకే శివకుమార్ నేతలందరినీ కలుపుకుపోవడంలో ఒక మెట్టుదిగారు. పార్టీ అధికారంలోకి రావడమే ప్రధానం అన్నట్లుగా ఆయన వ్యవహరించారు. తాను ముఖ్యమంత్రి కావాలన్న కోరిక డీకేకి బలంగా వున్నా, ఆ కోరికని చంపుకుని ఆ అవకాశం సిద్ధారామయ్యకి ఇచ్చి, తాను ఉప ముఖ్యమంత్రి పదవికే పరిమితమయ్యారు. కర్ణాటకలో కూడా ఆ ఇద్దరు నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఇద్దరూ కష్టపడ్డారు.. అందుకే ఇద్దరూ ఉన్నత పదవులు అలంకరించారు.

## తెలంగాణలో...

ఆంధ్రా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుండి తెలంగాణ కాంగ్రెస్‌లో ముదుర్లు ఉన్నారు. వారిమధ్య నిత్యం జరిగే ఆధిపత్య పోరు అంతర్గత విభేదాల కారణంగానే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీ పదేళ్ళ పాటు అధికారం చేజిక్కించుకోలేకపోయింది. ఇక్కడ టీడీపీ నుండి వలస వచ్చిన రేవంత్‌రెడ్డి, కేసీఆర్ బృందాన్ని ధీటుగా ఎదుర్కొన్నారు. అడ్డూ అపు లేని కల్వకుంట్ల నోటికి సరిసమానంగా సమాధానం చెప్పగలిగే ధీరత్వం కలిగిన నాయకుడిగా రేవంత్ ప్రజాక్షేత్రంలో గుర్తింపు పొందాడు. అప్పటికే కాంగ్రెస్‌లోఉన్న వృద్ధ జంబూకాలకన్నా వెయ్యి రెట్లు మేలైన, ధీటైన యువనేతగా ప్రజాభిమానాన్ని చూరగొన్నారు రేవంత్. ఇదే సమయంలో ముక్కలు చెక్కలుగా ఉన్న టీ–కాంగ్రెస్‌ని ఒక వేదికపైకి తేగలగడంలో కూడా రేవంత్ సఫలమయ్యారు. రాజశేఖరరెడ్డి తరహాలో తెలంగాణ మొత్తం తిరుగుతూ ఓ వైపు ప్రజల కష్టాలు గమనిస్తూ, మరోవైపు పార్టీని పటిష్ట పరుస్తూ భట్టి విక్రమార్క చేసిన పాదయాత్ర ఆ పార్టీకి లాభాన్ని తెచ్చిపెట్టింది. ఇటు రాజకీయ వ్యూహం మరోవైపు బట్టి సహకారంతో కాంగ్రెస్ పెద్దలతో రేవంత్ స్నేహం కాంగ్రెస్‌కి కలిసొచ్చింది. ఫలితంగా అధికారం సాధించి పెట్టింది. ఇప్పుడు రేవంత్ ముఖ్యమంత్రిగా, భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది. వాళ్లిద్దరూ కష్టపడ్డారు కాబట్టి అదృష్టం వారిని వరించింది. "ఉట్టికెగరలేనమ్మ... నింగికెగురుతానన్నట్లు" తన సొంత రాష్ట్రంలోనే గెలవలేని కేసీఆర్ తన తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చి స్థానికంగానే కాకుండా జాతీయస్థాయిలో కూడా బొక్కబోర్లా పడ్డారు.

## ఆంధ్రాలో...

ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఎన్నికలు ఒక ప్రత్యేకతని సంతరించుకున్నాయి. గత ఎన్నికలలో 151సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ పార్టీ.. వైసీపీ ప్రభావానికి మిగిలిన పార్టీలన్నీ గాలికి కొట్టుకుపోయాయని చాలామంది భావించారు. రెండు చోట్లనుండి పోటీచేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఒక్క చోట కూడా గెలవలేకపోగా ఒక్క సీటుకే పరిమితం కావడంతో పవర్ స్టార్ చాపచుట్టేస్తారని కూడా కొందరు తలచారు. వయసు ఉడిగిన చంద్రబాబు లాంటి నాయకులు మొండివాడైన జగన్‌మోహన్‌రెడ్డితో ఇక ఢీకొనలేదని కొంతమంది ఊహించారు. అయితే, 2024 ఎన్నికలు వచ్చేనాటికి ఇవేమీ జరగలేదు. తనని అరెస్టు చేయడంతో రెట్టింపు ఉత్సాహంతో బాబు జైలు నుండి తిరిగొచ్చారు. పవన్ కళ్యాణ్‌ని అన్ని విధాలా వైసీపీ నేతలు రెచ్చకొడుతుండడంతో ఆయన మీసం తిప్పి ముందుకొచ్చారు. ఇక జన్మలో బాబు ముఖం చూడరనుకున్న కమలనాథులు బాబుని వాళ్ళే పిలిచి మరీ స్నేహహస్తమందించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుని చీలనీయ వద్దు అని పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుకి ఆంధ్రా ఓటర్లు స్పందించారు. బీజేపీ – టీడీపీ – జనసేన నేతలు సైతం ఖంగుతినే తీర్పునిచ్చారు. అనూహ్యంగా 164 సీట్లతో కూటమిని దీవించారు. వైసీపీని ఆ పార్టీ నాయకులని ఇంటికి పంపించారు. చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రయ్యారు, పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. కమలనాథులు ఆంధ్ర ప్రభుత్వంలో, టీడీపీ జనసేన శ్రేణులు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యులయ్యారు. ఔను.. వాళ్లిద్దరూ కష్టపడ్డారు. ఒకరు ముఖ్యమంత్రైతే, మరొకరు ఉప ముఖ్యమంత్రి అయ్యారు.

## పొత్తే శరణం గచ్ఛామి!

జరుగుతున్న పరిణామాలు, సంభవిస్తున్న సంఘటనలు గమనిస్తే భవిష్యత్తు రాజకీయమంతా పొత్తులపైనే ఆధారపడి వుందన్నది స్పష్టమైపోతోంది. కాదు కూడదు అంటూ మూర్ఖత్వం, మొండి ధైర్యంతో ఒంటరి పోరాటం చేస్తే ఓటమి తప్పదన్నది అర్థమైపోతుంది. అందుకే కాబోలు మన పెద్దలు 'కలిసివుంటే కలదు సుఖం' అన్నారు. శుభం భూయాత్..!

# మత్స్యకారులు, గిరిజనులకు అండగా ఉంటాం

**పోలంరెడ్డి దినేష్‌రెడ్డి**




తీరప్రాంతాల్లోని మత్స్యకారులకు, గిరిజనులకు అండగా ఉంటామని, వారి జీవన విధానం మరింత మెరుగ్గా ఉండేందుకు కృషిచేస్తామని ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చెప్పారు. గూడూరు నియోజకవర్గం కోటలో డిసెంబర్ 5వ తేదీ గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఆయన గూడూరు శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. పలు కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలు నదులు, చెరువుల్లో, సముద్రంలో కలవడం వల్ల మత్స్యసంపదకే కాక, దానిమీద ఆధారపడి జీవించే గిరిజనులు, మత్స్యకారుల మీద ప్రభావం చూపుతుందన్నారు. అందువల్ల ఆ వ్యర్థాలను కట్టడిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత ఆ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు.

# ఎన్‌సిసి కేడెట్ల సేవాభావం




డిసెంబరు 4న భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఎన్‌సిసి కేడెట్లు రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీచేశారు. 10–ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ అండ్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే ఆదేశాలతో ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. స్థానిక కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ ప్రసూతి చిన్నపిల్లల ఆసుపత్రి వరకు ప్రదర్శనగా వెళ్ళి, నెల్లూరు ప్రభుత్వ ప్రధాన వైద్యశాల చిన్నపిల్లల వార్డులో ఉన్న రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నరేంద్రబాబు మాట్లాడుతూ, దేశ రక్షణలో నౌకాదళం పాత్ర ఎంతో గొప్పదన్నారు. చిన్నవయసు నుంచే ఎన్‌సిసి కేడెట్లు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొని సమాజానికి తమవంతు సేవలందించడం అభినందనీయమన్నారు.

# 'హెల్పింగ్ హ్యాండ్స్' కృష్ణారెడ్డి.. కన్నుమూత!



'హెల్పింగ్ హ్యాండ్స్' కృష్ణారెడ్డిగా పేరెన్నికగన్న డా. తుమ్మల కృష్ణారెడ్డి ఇక లేరు. ఈనెల 3వ తేదీ మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 85 ఏళ్ళు. గత కొద్దినెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండేవారు. అంతకుముందు రోజుల్లో ఆయన పేదసాదలకు సేవ చేసేందుకు ఎంతో తపనపడేవారు. ఆయన ఏ పని చేసినా సేవే ప్రామాణికంగా అంకితభావంతో చేసేవారు. సుదూరప్రాంతాల్లో ఉన్న బాధితులను కూడా ఆయన స్వయంగా కలిసి వారికి తనవంతు సేవలందించేవారు. ఆపదల్లో, అసహాయస్థితిలో ఉన్నవారిని ఆదుకోవడమే ధ్యేయంగా 'హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థను కూడా స్థాపించి, తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన ఒంటిచేత్తోనే నిర్వహించారు. అంతేకాదు, తాను నివాసం ఉంటున్న మాగుంట లేఅవుట్ కమిటీ కార్యవర్గ సభ్యుడిగా లేఅవుట్ అభివృద్ధిలో కూడా ఆయన పాలుపంచుకున్నారు. అటు ప్రజాసేవలోనూ, ఇటు బాధితులకు సాయం చేయడంలోనూ ఆయన ముందుండేవారు. ఆయన సతీమణి కొద్దికాలం క్రితమే దివంగతురాలయ్యారు. వారికి ఇద్దరు కుమార్తెలు. పదుగురికి సేవలందించే కృష్ణారెడ్డితో పాటు, ఆయన అందించే ఆపన్నహస్తాలు (హెల్పింగ్ హ్యాండ్స్) ఇక లేకపోవడం బాధాకరమే. కృష్ణారెడ్డి మృతికి చింతిస్తూ, తండ్రి మరణంతో ఆవేదనలో ఉన్న వారి కుమార్తెలకు, అల్లుళ్ళకు..వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది..'లాయర్'!...



## తెలుగువారి 'వర'ప్రసాదం!

ఆయనలా –
జ్ఞానతృష్ణను ఆవిష్కరింపజేసుకొన్న
మహోన్నత మూర్తిమత్వం ఎందరికుంటుంది!
ఆయనలా –
అవనీతలంలో విద్యావికాసాలకు
అగ్రతాంబూలం అందించే
దాతృత్వం, అంకితభావం ఎవరికుంటుంది?
నిత్యపఠనం, పుస్తకప్రియత్వం
అకుంఠిత దీక్షాపరత్వం
ఆయన కఠోర పరిశ్రమకు
నిలువెత్తు తార్కాణం
తానెప్పుడు విద్యార్థిగా భావించే
నమ్రతా విశేషం ఆయన విశిష్టగుణం!
ఆయన అడుగు అడుగులో
సరస్వతీపుత్రుడు తొణికిసలాడుతుంటాడు
ఆయన నడిచే పుస్తకమై భాసిల్లే
మహిమాన్వితస్వరూపం!
ప్రతి భారతీయుని ఎదలో
నిండుగ కొలువైన దీపం
ఆయనో విజ్ఞాన ఖని
ఆయన అందించే స్ఫూర్తి
మనకు అజరామరమై నడిపిస్తుంది.
భావితరాలకు దీప్తినిస్తుంది.
తల్లిని గుండెల్లో ప్రతిష్ఠించుకున్న
అసమాన మాతృప్రేమికుడు
ఆయనే తెలుగువారి 'వర'ప్రసాదం
తెలుగునేలన కీర్తి ప్రాకారం!

(శాంత బయోటెక్నిక్స్ వరప్రసాదరెడ్డి గారు
తెలుగు యూనివర్శిటీ
విశిష్ట వ్యక్తిగా సన్మానింపబడే వేళ...)



**చిన్ని నారాయణరావు**
9440202942

## అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం



నెల్లూరు వేదాయపాళెంలో వెలసివున్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఇటీవల స్వామివారికి కేరళ సంప్రదాయ రీతిలో కార్తీకమాస మండల పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని పుష్పాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండల పూజలలో భాగంగా, ఉదయం పాలాభిషేకం, మహా గణపతి హోమం, ఉష:పూజ, నవకాభిషేకంతో పాటు, అయ్యప్ప స్వామికి వైభవంగా పుష్పాభిషేకం, శ్రీవేలి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం కార్తీక మహా దీపారాధన, భగవతి సేవ, అత్తాళ్ళ పూజ, శ్రీవేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం అయ్యప్పస్వాములకు, భక్తులకు అన్నదానం, సాయంత్రం అయ్యప్ప స్వాములకు రాత్రి భిక్ష చేపట్టారు. ఉభయకర్తలుగా పద్మప్రియ ఫైనాన్స్, మేఘన ఆటోమొబైల్స్ అధినేతలు గడ్డం రత్నయ్య సుజాతమ్మ దంపతులు, సంగమయ్య నాగమ్మ దంపతులు, కుమారి భావన, కుమారి మేఘనలు వ్యవహరించారు. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పి.ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

# నగరాభివృద్ధి కోసమే పన్నుల వసూలు

### --- మంత్రి నారాయణ స్పష్టీకరణ ---



నెల్లూరు నగరాభివృద్ధి కోసమే పన్నులు వసూలు చేయడం జరుగుతుందని, ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పన్నులను వసూలు చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్థానిక కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కార్యాలయ ఆవరణలో కమిషనర్ సూర్యతేజతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం, మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని, అభివృద్ధి కోసమే పన్నులు వసూలు చేస్తున్నామని చెప్పారు. అవసరమైతే గడువు ఇస్తామని.. గడువులోపు చెల్లించకపోతే చట్టప్రకారం వ్యవహరిస్తామని అన్నారు. పన్నుల చెల్లింపుల విధానం రాష్ట్రమంతా ఒకేలా ఉంటుందని, నెల్లూరుకి ప్రత్యేకంగా ఉండదన్నారు. లేఅవుట్లు, బిల్డింగ్‌లకు మున్సిపల్ అనుమతుల నిబంధనలను సరళతరం చేస్తున్నామని, వాటిని కచ్చితంగా పాటించాలన్నారు. అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ అనుమతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. నెల్లూరు నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగరంలోని అన్ని పార్కులను అందంగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే 37 పార్కులకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక అమలులో ఉందన్నారు. నగర వీధుల్లో విచ్చలవిడిగా తిరిగే ఆవులను యజమానులు తీసుకెళ్లవలసిందిగా సూచించారు. చెత్తను శుద్ధి చేసే వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నెల్లూరుకు మంజూరైందన్నారు. నగరంలో 90 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ఇంకా అవసరమైన 100 సీసీ కెమెరాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరి అభివృద్ధికి.. కాకర్ల కృషి

### అమెరికా పారిశ్రామికవేత్తలకు.. రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా కాకర్ల




ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పారిశ్రామికాభివృద్ధికి సేవలందిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికా పారిశ్రామిక వేత్తలతో తనకున్న సంబంధాలను, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అనుసంధానం చేస్తూ, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో అమెరికా పారిశ్రామికవేత్తలైన విమల్‌కుమార్ కొలప్ప, సాయి కిరణ్ కొలవెన్నులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి పరిచయం చేశారు. ఎన్నారై పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేందుకు, రాష్ట్రంలో ఆగ్రో ఫామ్స్ కేంద్రాలను ఏర్పాటుచేసి, వాటిద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కాకర్ల చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు.

# తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం

### అమ్మానాన్నలను ఆహ్వానించండన్న డీడీ

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న తల్లితండ్రులు–ఉపాధ్యాయుల సమావేశానికి మీ అమ్మానాన్నలను ఆహ్వానించాలని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు బి.శ్రీనివాసులు వసతిగృహాల్లో ఉంటున్న పిల్లలకు సూచించారు. ఆ మేరకు ఆహ్వాన పత్రాన్ని తయారుచేసి తల్లిదండ్రులకు పంపి వారిని ఆహ్వానించాలని చెప్పారు. అలాగే వసతి గృహ సంక్షేమ అధికారులు ఫోన్ ద్వారా వసతి గృహ పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులు 7వ తేదీన జరిగే ఈ సమావేశానికి వస్తే తమ పిల్లల పరిస్థితులు, వారెలా చదువుతున్నారు, వారి సమస్యలేమిటి..వారి ప్రవర్తన వగైరాలన్నీ తెలుసుకోవచ్చునని చెప్పారు. తల్లి దండ్రులు ఆ సమావేశానికి వస్తే పిల్లలు కూడా సంతోషిస్తారని ఆయన పేర్కొన్నారు.

## టూకీగా...



### మనుబోలు బ్రహ్మేశ్వరునికి రుద్రాభిషేకం

ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 1న మండల కేంద్రమైన మనుబోలులో వెలసివున్న కామాక్షీదేవి సమేత శ్రీ బ్రహ్మేశ్వరస్వామివారికి ఆలయ అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో వైభవంగా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అన్నాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### కావలిలో రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సిలింగ్

కావలి పట్టణంలోని రౌడీషీటర్లకు డీఎస్పీ శ్రీధర్ ఈనెల 1న కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతలకు భంగం కలిగించినా, రౌడీయిజం చేసినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. సత్ప్రవర్తనతో ఉంటే భవిష్యత్తులో వారిపై ఉన్న రౌడీషీట్లు తొలగిస్తామని చెప్పారు. టూటౌన్ సీఐ గిరిబాబు, రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### సీతారామపురం ఆరోగ్యకేంద్రం తనిఖీ

మండలకేంద్రమైన సీతారామపురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఈనెల 2న జిల్లా వైద్యారోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సరైన వసతులున్నాయా లేదా చూశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. డీపీఓ రమేష్, స్థానిక వైద్యాధికారిణి స్వప్న, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### అనంతసాగరంలో బాల్యవివాహాల నిరోధంపై అవగాహన

మండలకేంద్రమైన అనంతసాగరం గిరిజనకాలనీలోని గిరిజనులకు బాల్యవివాహాల నిరోధం పట్ల సీడీపీఓ పద్మావతి అవగాహన కలిగించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వారికి విడమరచి చెప్పారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, చిన్నవయసులోనే పెళ్ళిళ్లు చేస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. సూపర్‌వైజర్ శారద తదితరులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో రేషన్‌షాపు ఏర్పాటుకు వినతి

తమ కాలనీలకు రేషన్‌షాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఉదయగిరిలోని బీసీ–ఎస్టీ కాలనీలు, మంగళగిరి కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలకు అనువుగా ఉండేలా రేషన్‌షాపు ఏర్పాటుచేయాలని ఈనెల 2న వారు తహశీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేశారు.

### వెంకట్రావుపల్లిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ వద్ద పేకాటాడుతున్నారనే సమాచారంతో, సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 26,750 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్‌లతో పాటు పోలీసు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

### కోవూరులో భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ఆదివారం అమావాస్య సందర్భంగా ఈనెల 1న కోవూరులోని గాంధీపార్కు కూడలిలో ఉన్న కామాక్షీదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామి వారి దేవాలయంలో స్వామివారికి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు.

### వెంకన్నపాళెంలో పంటపొలాల పరిశీలన

మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామంలో ఇటీవల భారీవానలతో నీట మునిగిన పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి జహీర్ ఈనెల 2న పరిశీలించారు. వాననీళ్లు తొలగించాక పంటలు కుళ్ళిపోకుండా ఎలా కాపాడుకోవాలో ఆయన రైతులకు సూచించారు.

### గండిపాళెం ప్రాజెక్టులో పెరిగిన నీటిమట్టం

ఫెయింజల్ తుఫాన్ వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు ఉదయగిరి రూరల్‌లోని గండిపాళెం ప్రాజెక్టులో నీటిమట్టం 14 అడుగులకు చేరింది. జిల్లాలో కురుస్తున్న వానతో పాటు, ఎగువప్రాంతాల్లో వర్షాలవల్ల వరద నీటి ప్రవాహం పెరగడంతో ఈ ప్రాజెక్టు పుష్కలంగా నీటితో కళకళలాడుతోంది.

# 16 మందికి సీఎం సహాయనిధి

## • 28.90 లక్షలు పంపిణీచేసిన మంత్రి ఆనం



ఆత్మకూరు నియోజకవర్గంలోని 16 మంది లబ్దిదారులకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నెల్లూరు నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఆయన రు.28,90,916 రూపాయల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదప్రజలకు సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహృదయంతో బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను ఉదారంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించిన ఈ సహాయనిధి ద్వారా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సుమారు 16 మంది నిరుపేద కుటుంబాలు నిలదొక్కుకుంటాయని, ఆ కుటుంబాల తరపున ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# మత్స్యకారుల సంక్షేమంపై ఏం చర్యలు తీసుకున్నారు?

## - లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలు



మత్స్యకారుల సంక్షేమానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. దేశంలోనూ, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారుల నైపుణ్యాభివృద్ధికి, శిక్షణ అందించడానికి ప్రభుత్వం ఏమైనా పథకాలను అమలుచేస్తోందా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో బీమా ప్రయోజనాలను పొందిన మత్స్యకారుల వివరాలు తెలియజేయాలని, వారి కోసం అమలు చేస్తున్న ప్రాజెక్టుల గురించి తెలపాలని అడిగారు. అందుకు కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 15,46,004 మంది, నెల్లూరు జిల్లాలో 1,81,222 మంది మత్స్యకారులు ఉన్నారని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద నైపుణ్యాభివృద్ధి, శిక్షణలు, అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులు, చేపల పెంపకందారులకు ప్రమాద బీమా ఉందని, ఇందులో బీమా ప్రీమియం మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రాలు భరిస్తాయన్నారు. లబ్దిదారుని నుంచి ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరణం లేదా శాశ్వత వైకల్యం ఏర్పడితే ఈ పథకం కింద రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యం ఏర్పడితే రెండు లక్షలా 50వేల వంతున ఇస్తారన్నారు. ఒకవేళ ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరితే ఖర్చుల కింద పాతికవేల రూపాయలు అందజేస్తున్నామని చెప్పారు. 2021-22 నుండి 2023-24 వరకు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 1కోటి 32 లక్షల మంది ఈ పథకాల కింద లబ్ధిపొందారని కేంద్రమంత్రి వివరించారు

# విద్యకే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

## - మంత్రి డోలా వీరాంజనేయస్వామి



విద్యతోనే సమాజంలో పేదరికం అంతమవుతుందని, అందుకే తమ ప్రభుత్వం విద్యారంగానికి తొలి ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి చెప్పారు. ఈనెల 3వ తేదీ రాత్రి, మండల కేంద్రమైన బోగోలు అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించిన మంత్రి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, లైట్లు వెలగకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని సిబ్బందికి చెప్పారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని... విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

## చేపలమేతగా కోళ్ళ వ్యర్థాల వాడకంపై..

# ప్రశాంతిరెడ్డి ఆగ్రహం

## • ప్రజారోగ్యం చెడగొడుతున్నారంటూ మండిపాటు



కుళ్లిపోయి.. గబ్బుకొట్టే కోళ్ల వ్యర్థాలను, పశువుల కళేబరాలను చేపలమేతగా చేపలగుంటల్లో వేస్తూ, ప్రజారోగ్యాన్ని చెడగొడుతున్నవారిపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మండిపడ్డారు. అలాంటివారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 4న ఆమె నెల్లూరులోని తమ నివాసంలో బుచ్చి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాలకు చెందిన పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోళ్ళవ్యర్థాలను చేపల మేతగా వేయడాన్ని నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం 2016లో జీఓ నం.56ని జారీ చేసిందని ఆమె గుర్తుచేశారు. చేపల మేతగా వాడేందుకు అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను అడ్డుకోవాలని చెప్పారు. పోలీసులు, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు ప్రత్యేకించి దీనిపై దృష్టి పెట్టాలని, చేపలమేతగా కోళ్ళవ్యర్థాలను వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. నిషేధాన్ని ఉల్లంఘించి అక్రమంగా ఆ వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తుండడాన్ని నియంత్రించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యం



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల సచివాలయానికి ప్రారంభోత్సవం చేశారు. బుచ్చి నగరపంచాయతీలో జెసిబి మరియు ఫాగింగ్ మిషన్ ప్రారంభించారు. అనంతరం నగర పంచాయతీలో పనిచేసే 117మంది పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్స్‌తో పాటు శానిటేషన్ హెల్త్ కిట్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బుచ్చిలో పాత మార్కెట్‌ను ఆధునీకరిస్తామన్నారు. పారిశుద్ధ్యకార్మికుల సేవలను ఆమె ప్రస్తుతిస్తూ, తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి మన ఆరోగ్యాన్ని పరిరక్షించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మమ్మ, షాహుల్, హజరత్తయ్య, వైష్ణవి, శివ, టీడీపీ సీనియర్ నాయకుడు యల్లారెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల భద్రత..

# అందరి బాధ్యత

## - డీఆర్ఓ ఉదయభాస్కరరావు



ఆడపిల్లల భద్రతపై ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని, సమాజ శ్రేయస్సుకు కిశోర బాలికల వికాసం అత్యంత ఆవశ్యమని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు చెప్పారు. ఈనెల 3న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన 'కిశోర బాలికల వికాసం-జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం'లో ఆయన మాట్లాడుతూ, ఆడపిల్లలకు 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు అత్యంత విలువైనదన్నారు. ఆ వయసులో వారికి సమాజం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం అవసరమన్నారు. వారు సోషల్ మీడియా, సినిమాలు, ఇతరత్రా వ్యాపకాల బారిన పడకుండా చూడాలని, వారు అన్ని రంగాల్లో రాణించేలా చూడాలన్నారు. సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను, మంచి చెడులను వారికి వివరించాలని సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి హేనా సుజన్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# హిందువులపై హింసలు..దారుణం

- బంగ్లా ఘోరాలకు వెల్లువెత్తుతున్న నిరసనలు
- నెల్లూరులో హిందూసంఘాల ఆందోళన



బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఘోరాలు, హింసాకాండ అమానుషమంటూ నెల్లూరులో హిందూ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపాయి. హిందూ రక్షణ వేదిక ఆధ్వర్యంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు ఈనెల 4న భారీ ర్యాలీ నిర్వహించి హిందువులపై జరుగుతున్న అరాచకాలకు వ్యతిరేకంగా గళమెత్తారు. స్థానిక వీఆర్‌సి గ్రౌండ్ వద్ద నుంచి బయలుదేరి నగరవీధుల్లో నిరసన ప్రదర్శన చేశారు. ఇందుకూరుపేటకు చెందిన శ్రీ లలితా మహేశ్వర పీఠాధిపతి మహేష్‌స్వామి మాట్లాడుతూ, ఇస్కాన్‌సంస్థకు చెందిన రామకృష్ణదాసు పట్ల బంగ్లా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మానవ హక్కులను హరించేదిగా ఉందంటూ మండిపడ్డారు. ఈ ప్రదర్శనలో బీజేపీ రాష్ట్ర నాయకులు పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, మిడతల రమేష్, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హమ్మయ్య!..కేసులు ఎత్తేశారు!

గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేయడంతో ఉపాధ్యాయసంఘాల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులపై ఉన్న కేసులను తొలగిస్తామంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించడం తెలిసిందే. ఆమేరకు స్థానిక దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఎత్తివేయడంతో, నెల్లూరులోని పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు దర్గామిట్ట సీఐ రోశయ్యను సన్మానించి ధన్యవాదాలు చెప్పారు. తాళ్ళూరు శ్రీనివాసులునాయుడు, సురేంద్రరెడ్డి, చిట్టేటి రమేష్, మురళీధర్, హజరత్, నవకోటేశ్వరరావు, పిచ్చిబాబు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com